ఘోర రోడ్డు ప్రమాదం..



వివరాలు 2లో..


# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 29, సెప్టెంబర్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8




# బుల్లెట్ ట్రైన్ పేరిట..భూ దందా..

- ప్రాజెక్టును వ్యతిరేకించం దోపిడీని సహించం
- రైతులపైకి నాలుగు వేల మంది పోలీసులా?
- ఎయిర్‌పోర్ట్ స్థలాలను తీసుకోవచ్చుకదా?
- కమీషన్ల దండుకొనేందుకే ఈ వ్యవహారం
- డబ్బులు ఇస్తే ఎవరైనా పాటలు పెడుతారా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం
- బహదూర్‌గూడ బాధితులకు అండగా ఉంటం



హైదరాబాద్, సెప్టెంబర్ 28 : బుల్లెట్ ట్రైన్ పేరిట ప్రభుత్వ పెద్దలు భూ దందాకు తెరతీశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన విమర్శలు చేశారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న బహదూర్‌గూడ రైతులతో సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో సమావేశమై వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 'అధైర్యపడొద్దు.. కేసీఆర్ తిరిగి సీఎం కాగానే మీ నాయకుడు కార్తీక్‌రెడ్డి చేతులమీదుగా పట్టాలిప్పిచ్చే బాధ్యత నాది' అని భరోసా ఇచ్చారు. 'మళ్లోసారి మీ భూముల మీదికి వస్తే సెల్‌ఫోన్‌తో ఆ పోలీసోళ్ల ఫొటో కొట్టండి.. కేసీఆర్‌కు పంపిస్తామని చెప్పండి' అంటూ రైతులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌కు వస్తున్న రైతుల ఫొటోలను పోలీసులు తీయడంపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. 'పోలీస్‌స్టేషన్‌లో పెట్టాల్సిన ఫొటోలెవవరివి?. రౌడీషీటర్లు, దొంగలు, తులం బంగారం ఇస్తామని ఆడబిడ్డలను, అత్తకు నాలుగువేలు, కోడలుకు రూ.2,500 అందిస్తామని మహిళలను, ఎకరాకు రూ.15 వేల రైతుబంధు ఇస్తామని రైతులను, జాబ్ క్యాలెండర్ జారీ చేస్తామని నిరుద్యోగులను, దళితబంధు ఎగ్గొట్టి దళితులను మోసం చేసిన వారి ఫొటోలు పెట్టాలి' అంటూ నిప్పులు చెరిగారు. 'ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ పట్టాలిస్తామని మిగతా 3లో..

# తెలంగాణలో ఓట్ల చోరీ వివాదం



- కాంగ్రెస్ vs బీజేపీ రాజకీయ యుద్ధం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : తెలంగాణా రాష్ట్రంలో ఓట్ల చోరీపై రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. ఓట్ల చోరీ అంశం అధికార, ప్రతిపక్ష పార్టీ నేతల మధ్య ప్రచ్ఛన్న యుద్ధానికి కారణమైంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో కోట్లాది ఓట్లను కుట్ర పూరితంగా తొలగించారని ఆరోపిస్తూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల దుమారం ఇప్పుడు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఆందోళనలకు కారణం అయింది. తాజాగా హైదరాబాద్‌లోని బిఆర్‌కే భవన్‌లో కాంగ్రెస్ భారీ నిరసనకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వం వహించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల దొంగతనంపై రాహుల్ గాంధీ చేసిన హెచ్చరికలు నిజమయ్యాయని స్పష్టం చేశారు. రాజ్యాంగ ప్రతి చేతిలో పట్టుకుని మెమోరాండం సమర్పించిన భట్టి, పౌరుల ఓటు హక్కును పరిరక్షించడానికి ప్రజాస్వామ్య శక్తులన్నీ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓటర్ల మిగతా 3లో..

# జూరాలకు తగ్గిన వరద



గద్వాల/అయిజ, సెప్టెంబర్ 28 : జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి 2,500 క్యూసెక్కులు వచ్చి చేరుతుం డగా.. కాల్వలు, లిఫ్టులకు నీటిని ఎత్తిపోస్తున్నారు. డ్యామ్ పూర్తి స్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.316 టీఎంసీలు నిల్వ ఉన్నది.కర్ణాటకలోని ఆర్డీఎస్‌కు స్వల్ప వరద కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 1,527 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 1,007 క్యూసెక్కులుగా నమోదైంది. అలాగే తుంగ భద్ర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నమోదు కాలేదు. అవుట్‌ఫ్లో 9,064 క్యూసెక్కులుగా ఉన్నది.

# అంతిమ యుద్ధానికి మేం సిద్ధంగా ఉన్నాం..

- ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ స్ట్రాంగ్ కౌంటర్..!



న్యూఢిల్లీ, సెప్టెంబర్-27 : ఇరాన్ శాంతి ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొ ట్రంప్ తిరస్కరించడంతోపాటు బెదిరింపు ధోరణిలో వ్యాఖ్యలు చేయడంతో పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి నెలకొన్నది. ఈ క్రమంలో ఇరాన్ కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అమెరికాతో తాము అంతిమ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ అంతర్జా తీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటిం చారు. అమెరికాతో యుద్ధాన్ని తిరిగి ప్రారంభించేందుకు తాము పూర్తి సిద్ధంగా ఉన్నామని, ఒకవేళ అది అంతిమ యుద్ధానికి దారితీసినా తాము ఎదుర్కొంటామని అరాగ్చీ అన్నారు. అదే సమయంలో చర్చలకూ తాము సిద్ధమేనని, ఏది జరగాలన్నది ట్రంప్ చేతిలోనే ఉందని అరాగ్చీ చెప్పారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచే ప్రతిపాదనలను ట్రంప్ బహిరంగంగా తిరస్కరిం చడంపై ఆయన స్పందించారు. ఈ అంశంపై దౌత్యమార్గాల ద్వారా తమకు ఎలాంటి కమ్యూనికేషన్ లేదని చెప్పారు.అక్రమంగా ఫ్రీజ్ చేసిన తమ డబ్బులు, ఆస్తులు తమకు కావాలని అరాగ్చీ డిమాండ్ చేశారు. తమ మిగతా 3లో..

# హైదరాబాద్‌లో యువకుడి హత్య..

- చున్నీతో బిగించి చంపిన వివాహిత



హైదరాబాద్, సెప్టెంబర్ 28 : హైదరాబాద్‌లోని ధూల్‌పేట్‌లో సాయి అనే యువకుడిని ఓ మహిళ హత్య చేసింది. వివాహిత అనిషా సింగ్ చున్నీని అతడి మెడకు బిగించి చంపేసింది. యువకుడు గత కొంతకాలంగా తనను వేధిస్తున్నాడని ఆమె తెలిపింది. సమాచారం అందగానే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మహిళకు వేధింపులు తాళలేకనే హత్య చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. సాయిని ప్లాన్ ప్రకారం ఇంటికి పిలిపించి మరీ ఆమె అంతమొందించింది. అతడిని పలుమార్లు హెచ్చరించినా పద్ధతి మార్చుకోకపోవడంతోనే ఈ హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇంకెవరి ప్రమేయమైనా ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

# జీహెచ్ఎంసీ, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



- పార్టీ శ్రేణులతో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : హైదరాబాద్ (జీహెచ్ఎంసీ)తోపాటు స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని, ఇకపై అన్ని ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన తరఫున పోటీ చేద్దామని పార్టీ శ్రేణులతో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధం కావాలని సూచించారు. టీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి మెదక్ జిల్లాల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించాలని, పార్టీ శ్రేణులు నిత్యం ప్రజల్లోనే ఉంటూ సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలన్నారు.ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్ని ప్రమాదం జరిగి ఐదుగురు చిన్నారులు మృతిచెందిన ఘటనలో తెలంగాణ రక్షణ సేన స్పందించిన తీరుతోనే ప్రభుత్వం దిగొచ్చిందని గుర్తు చేశారు. తక్షణ చర్యల కోసం రిమ్స్‌కు రూ.11కోట్లు విడుదల చేసిందని, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటిం చిందని చెప్పారు. కాగా, మెడికల్ సీట్లలో స్థానికతను మార్చే విధంగా ప్రభుత్వం తెచ్చిన జీవో33, జీవో 150తో తెలంగాణ విద్యార్థులకు తీరని నష్టం వాటిల్లుతుందని కవిత ఆరోపించారు. తెలంగాణకు నష్టం చేసే ఈ జీవోలను వెంటనే ఉపసంహరిం చుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# తెలంగాణకు అమిత్ షా..



## అక్టోబర్ 4న మెదక్ పర్యటన

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన ఖరారైంది. అక్టోబర్ 4వ తేదీన మెదక్ జిల్లాకు అమిత్ షా రానున్నారు. తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లిలో ఆముల్ కంపెనీ ఏర్పాటు చేస్తున్న మిల్క్ బల్క్ యూనిట్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు.5 లక్షల లీటర్ల కెపాసిటీతో మిల్క్ బల్క్ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ కార్యక్రమం అనంతరం రైతు బహిరంగ సభలో పాల్గొని అమిత్ షా ప్రసంగించనున్నారు. అమిత్ షా మెదక్ జిల్లాకు వస్తున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# త్వరలోనే ఖైరతాబాద్ ఉప ఎన్నిక..




- అసెంబ్లీ కీలక ప్రకటన.. గెజిట్ నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : ఖైరతాబాద్ నియోజకవర్గ ఉప ఎన్నికపై కీలక అప్డేట్ వచ్చింది. 2024 ఏప్రిల్ 23 నుంచే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ సెక్రటరీ తిరుపతి గెజిట్ జారీ చేశారు. ఈ మేరకు హైకోర్టు తీర్పునకు అనుగుణంగా సెప్టెంబర్ 26వ తేదీతో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో హైదరాబాద్ లో ఉప ఎన్నిక కన్ఫామ్ అయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు త్వరలోనే ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. ఇక ఈ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన దానం నాగేందర్ పై అనర్హత వేటు పడిన సంగతి తెలిసిందే. ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఇప్పటికే సుప్రీంకోర్టు సమర్థించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు ఆశ్రయించిన దానం నాగేందర్ కు చుక్కెదురైంది. ఆయన పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. తాజాగా అధికారికంగా తెలంగాణ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన నేపథ్యంలో ఖైరతాబాద్ ఉప ఎన్నికకు మిగతా 3లో..

# నటి రకూల్ ప్రీత్ సింగ్ ఇంట్లో ఐటీశాఖ సోదాలు



ముంబై,న్యూఢిల్లీ, సెప్టెంబర్-27 :: బాలీవుడ్ నటి రకూల్ ప్రీత్ సింగ్ తో పాటు ఆమె మామ, ఫిల్మ్ ప్రొడ్యూసర్ వాసు భగ్నాని, పనోరమా స్టూడియోస్‌తో పాటు మొత్తం 12 ప్రదేశాల్లో ఇవాళ ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు నిర్వహిస్తున్నది. నిధుల తరలింపులో అక్రమాలు చోటుచేసుకున్న కోణంలో ముంబై ఇన్‌కం ట్యాక్స్ శాఖ ఈ సోదాలు చేపడుతున్నది. ఫిల్మ్ ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ పేరుతో విదేశాలకు నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముంబై ఐటీశాఖకు చెందిన పలు బృందాలు.. ఇవాళ ఈ కేసులో డాక్యుమెంట్లు, ఫైనాన్షియల్ రికార్డులను పరిశీలిస్తున్నాయి.ఓవర్‌సీస్ లావాదేవీల గురించి కూడా ఐటీశాఖ ఆరా తీస్తున్నది. గత ఏడాది డిసెంబర్‌లో రకూల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ కోసం ఓ డ్రగ్ కేసులో పోలీసులు గాలింపు చేపట్టిన విషయం తెలిసిందే. 2025, డిసెంబర్ 19వ తేదీన డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పోలీసులు ఇద్దరు వ్యాపారులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 43 గ్రాముల కొకైన్, 11.5 గ్రాములు ఎండీఎంఏను సీజ్ చేశారు. అయితే ఈ కేసులో ఆ ఇద్దరు పెడ్లర్ల నుంచి అమన్ అయిదు సార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు అనుమానాలు ఉన్నాయి.

# ముందస్తు సమాచారం లేకుండా పేదల ఇండ్ల కూల్చివేతలు

వివరాలు 2లో..



# బిల్లులు ఇస్తారా ఇవ్వరా..

- డిప్యూటీ సీఎం భట్టి ఛాంబర్ ముందు కాంట్రాక్టర్ల ఆందోళన..



**హైదరాబాద్,సెప్టెంబర్-27 :** కాంగ్రెస్ సర్కార్ పాలనలో ఉద్యోగులతోపాటు కాంట్రాక్టర్లకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన చేపడుతున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. సెక్రటేరియట్ ముందు కూడా ఇప్పటికే ఉద్యోగులంతా నిరసన కూడా వ్యక్తం చేశారు. తాజాగా కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు మరోసారి ఆందోళన బాట పట్టారు. సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఛాంబర్ ముందు మరోసారి కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగుల ఆందోళన నిర్వహించారు. తాము ఎన్నిసార్లు కాళ్లరిగేనా తిరిగినా భట్టి విక్రమార్క కలవడం లేదని.. ఏళ్లు గడుస్తున్నా బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు వాపోయారు. బిల్లులు ఇస్తారా ఇవ్వరా.. తమకు భట్టితో అపాయింట్‌మెంట్ ఇప్పించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని రిటైర్డ్ ఉద్యోగులు భీష్మించుకుని కూర్చోవడంతో పోలీసులు వారించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 2024 ఆగస్టు 3న చనిపోయారు. ఈ రోజు వరకు రూపాయి కూడా రాకపోతే కుటుంబం ఎట్లా బతకాలి. ప్రభుత్వ ఉద్యోగం చేసుకునేది ఎందుకు సార్. ఎట్లా బతకాలి సార్ అంటూ రిటైర్ ఉద్యోగి కుటుంబ సభ్యుడొకరు ఆందోళన వ్యక్తం చేశాడు.

# ఘోర రోడ్డు ప్రమాదం..



- లారీ, ఆటో ఢీ, నలుగురు మృతి

**మంచిర్యాల సెప్టెంబర్-27 :** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ , ఆటో ఢీ కొన్న ఘటనలో నలుగురు మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. నస్పూర్ మండల కేంద్రంలో ఆటో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు స్పాట్‌లోనే చనిపోగా మరో ఇద్దరు ఆసు పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని హుటాహుటినా ఆసుపత్రికి తరలించారు. మృతులు మందమర్రి మండలం పొన్నారం గ్రామానికి చెందిన లక్ష్మి, వెంకటాపూర్‌కు చెందిన అగ్గు సౌందర్య, సోనియా , సుమలతగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. ప్రమాద స్థలాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్, ఏసీపి ప్రకాష్ సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను సిపి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంపై మంత్రి గడ్డం వివేక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వీరంతా తన నియోజకవర్గానికి చెందిన వారు కావడంతో వృద్ధుల కుటుంబాలకు తక్షణసాయంగా 25 వేలు, గాయపడ్డ వరకు 10వేలు అందిస్తున్నట్లు ప్రకటించారు.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..



- 72 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం

**హైదరాబాద్,సెప్టెంబర్-28 :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం 72 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాల్లో రాగల మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశమున్నదని వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో రానున్న 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని అధికారులు తెలిపారు. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ప్రస్తుతం దేశంలో నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ఊపందుకున్నదని అధికారులు చెప్పారు. మరోవైపు ఎ ల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.

# జనగామ కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం



**జనగామ టౌన్, సెప్టెంబర్ 28 :** జనగామ కలెక్టరేట్ ఎదుట ఓ రైతు సోమవారం ఆత్మహత్యకు యత్నిం చాడు. బచ్చన్నపేట మండలం చిన్నరాంచర్లకు చెందిన రైతు గుడికందుల కనకయ్యకు తొమ్మిది ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. దాన్ని కొలతలు వేస్తే 8 ఎకరాలు మాత్రమే చూపిస్తున్నది. పక్కనే ఉన్న మరో వ్యక్తికి రికార్డుపరంగా 10 ఎకరాలు ఉంటే అతడు 11 ఎకరాల భూమిని దున్నుకుంటున్నాడు. ఈ విషయంలో అధికారులు పట్టించు కోకపో వడంతో సోమవారం కలెక్టరేట్ ఎదుట డీజిల్ పోసు కొని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానిక పోలీసులు వెంటనే స్పందించి బాటిల్ గుంజుకోవడంతో ప్రమాదం తప్పింది.

# ఎన్‌హెచ్‌ఎం సమస్యలు పరిష్కరించాలి

- ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో 'చలో కమిషనరేట్' కార్యక్రమం
- ఉద్యోగులను అడ్డుకున్న పోలీసులు, స్టేషన్‌కు తరలింపు




**హైదరాబాద్,సెప్టెంబర్-28 :** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌హెచ్‌ఎం జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ మహేందర్‌రావు పుట్టా డిమాండ్ చేశారు. సోమవారం ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో చలో కమిషనరేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి 78 క్యాడర్లకు చెందిన సుమారు 15000 మంది ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా 'సమాన పనికి సమాన వేతనం.. ప్రజారోగ్యమే మా బాధ్యత.. మా ఉద్యోగ భద్రత ప్రభుత్వ బాధ్యత' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం మహేందర్‌రావు మాట్లాడుతూ.. తమ డిమాండ్లు నెరవేర్చడంపై ప్రభుత్వం తాత్సారం చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సత్వరమే స్పందించి న్యాయం చేయాలని డిమాం డ్ చేశారు. లేదంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ భరత్ కుమార్, జనరల్ సెక్రటరీ ఎండీ రుక్మద్దీన్, వైస్ ప్రెసిడెంట్ పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుమన్, సోషల్ మీడియా ఇన్‌చార్జి మొగిలి నరేశ్, స్టేట్ కో ఆర్డినేటర్ సెక్రటరీ వినోద్, మహిళా అధ్యక్షురాలు డాక్టర్ హరిప్రియ, నేతలు వినోద, స్వప్న, రేణుక, నిహారిక, కల్యాణి, విజేత తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులపై పోలీసు జులుం

చలో కమిషనరేట్ కార్యక్రమానికి తరలివస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. రోడ్లకు అడ్డంగా బారికేడ్లు పెట్టి ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. పలుచోట్ల ఉద్యోగులను నిర్బంధించి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పోలీసుల వైఖరిపై ఎన్ఎహెచ్‌ఎం జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. నిరసన తెలిపే హక్కుపై నిర్బంధం విధించడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని పాలన సాగిస్తున్నదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కుట్రలు కట్టిపెట్టి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని స్పష్టంచేశారు.

# ఇందిరమ్మ ఇల్లు రాలేదని.. ఒంటిపై పెట్రోల్ పోసుకున్న బాధితుడు

**జనగామ రూరల్, సెప్టెంబర్ 28 :** ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని తీవ్ర మనస్తాపంతో ఓ వ్యక్తి గ్రామపంచాయతీ వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం మండలంలోని ఎల్లంల గ్రామంలో చోటుచేసుకున్నది. అర్హులకు కాదని సర్పంచ్‌కు ఇల్లు మంజూరు కావడంతో గ్రామస్తులు పంచాయతీ కార్యాలయం వద్ద టెంట్ వేసుకొని నిరసనకు దిగారు. గ్రామంలోని వాట్సాప్, సోషల్ మీడియా గ్రూపుల్లో ఎంపీ, ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ వారి కోటాలో ఇండ్లు మంజురైనట్టు ఇటీవల ప్రచారం జరిగింది. అందులో పేర్లు సహా జాబితా రావడంతో గతంలో ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్న బిర్రు రాజు పేరు అందులో లేదు. సర్పంచ్‌కు ఇందిరమ్మ ఇల్లు రావడం తమలాంటి పేదలకు రాలేదని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో బిర్రు రాజు తీవ్ర మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకున్నాడు. గ్రామస్తులు అతన్ని అడ్డుకొని బాటిల్‌ను తీసుకొని పక్కన పడేశారు. తన కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడని కొందరు తప్పుడు సమాచారం ఇచ్చారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా అధికారులు అర్హులకు ఇండ్లు కేటాయించాలని కోరాడు.



# ముందస్తు సమాచారం లేకుండా పేదల ఇండ్ల కూల్చివేతలు

- అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసిన స్థానికులు
- మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ నేతల అరెస్ట్
- మీడియా ముందు నోరు తెరిస్తే మొత్తం ఇండ్లు కూల్చేస్తామంటూ అధికార పార్టీ నేత వార్నింగ్?
- నారాయణపేట జిల్లా మద్దూరులో ఘటన



**మద్దూర్, సెప్టెంబర్ 28 :** నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణంలోని పేదల ఇండ్లపైకి మరోసారి బుల్డోజర్లు విరుచుకు పడ్డాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇలాకాలో రోడ్డు విస్తరణ పేరుతో పేద, సామాన్యుడి గూడును కూల్చారు. దీంతో వారి జీవనాధారం ప్రశ్నార్థకంగా మారింది. ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని చెప్పి నమ్మించి జనంతో ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నేతలు తర్వాత జనంపై విరుచుకుపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రేవంత్ సర్కార్ కర్కశత్వానికి 60 కుటుంబాలు గూడు కోల్పోగా.. మరో 20 కుటుంబాలు ఇండ్లతోపాటు వ్యాపార దుకాణాలను కోల్పోయి నిల్వ నీడ లేకుండా పోయాయి. నేటి కాంగ్రెస్ పాలన చూస్తుంటే రజాకార్ల పాలన గుర్తొస్తున్నదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మద్దూరు పట్టణం నుంచి చింతల్‌దిన్నె వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. నిబంధనలు పాటించకుండా పనులు చేపట్టడంపై స్థానికులు తిరగబడ్డారు. పరిహారం ప్రకటించే వరకు తమ ఇండ్ల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు.. పోలీసులను అడ్డుపెట్టి మరీ ఇండ్లను నేలమట్టం చేశారు. కనీస సమాచారం లేకుండా.. ఒక్క నోటీస్ కూడా ఇవ్వకుండా ఇండ్లపై బుల్డోజర్లను తీసుకురావడం ఏమిటని బాధితులు నిలదీశారు. ఉన్న గూడు కూల్చివేస్తే తాము కట్టుబట్టలు, సామగ్రితో ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. తమ ఉసురుపోసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని శపించారు. కండ్ల ముందే కూలుతున్న నిర్మాణాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తమ బతుకులను రోడ్డున పడేసినోడి బతుకు సర్వ నాశనం కావాలంటూ శపించారు. తమ సామగ్రిని సర్దడానికైనా కొంత సమయం ఇవ్వాలని వేడుకున్నా.. వినకుండా బలప్రదర్శన చేశారు. కూల్చివేతలు నిలిపివేయాలని అడ్డుకోవడానికి వెళ్లిన పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మీడియా ఎదు ట నోరు తెరిస్తే మొత్తం ఇండ్లను కూల్చేస్తామంటూ స్థానిక నేతలు బాధితులకు వార్నింగ్ ఇచ్చినట్టు సమాచారం. బాధితుల వాదనలు వినకుండా.. కనీసం వారితో చర్చించకుండా నోటీసుల ఊసే లేకుండా ఇండ్లను కూల్చడంపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధితులకు మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకొన్నారు. అధికార పార్టీ నేతల అం డదండలే హద్దుగా రెచ్చిపోయి అక్రమంగా అరెస్ట్ చేసి వివిధ పోలీస్టేషన్లకు తరలించారు. మున్సిపల్ కేంద్రం నుంచి చింతల్‌దిన్నెకు అం త పెద్ద రోడ్డు అవసరం లేకున్నా అధికారులు పేదలపై పగబట్టి ఈ దుస్సాహసానికి ఒడిగట్టారంటూ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు.

## పరిహారమిచ్చి ఇండ్లు కూల్చండి : పట్నం

ఇండ్లు, వ్యాపార సముదాయాలు కోల్పోతున్న బాధితులకు పరిహారం ఇచ్చి కూల్చివేతలు చేపట్టాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సూచించారు.

సోమవారం నారాయణపేట జిల్లా మద్దూర్‌లో రోడ్డు విస్తరణ పేరుతో జరిగిన ఇండ్ల విధ్వంసంపై ఆయన ఒక ప్రకటనలో స్పందించారు. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని నియోజకవర్గ ప్రజలు ఆనందపడితే.. ఇప్పుడేమో అరాచక పాలనకు తెరలేపారని దుయ్యబట్టారు. పేదల కష్టాలను తొలగించాల్సిన సీఎం వారిని ఇంకా కష్టాల్లోకి నెడుతూ.. ఉన్న గూడును కూల్చుతూ నిలువ నీడలేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఓ వైపు భూములు గుంజుకుంటూ.. మరోవైపు ఇండస్ట్రియల్ కారిడార్‌లో బినామీ రైతుల పే రుతో రూ.కోట్లు కొల్లగొట్టి.. రేడియల్ రోడ్ల పే రిట పేద ప్రజల భూములను చెరబడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఇకనైనా విధ్వంసపాలన ఆపకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కేకే కుటుంబ సభ్యుల దౌర్జన్యం!

- మా భూములు కబ్జాలు చేసి.. ఉల్టా మాపైనే కేసులా?: రైతులు
- భూములను పరిశీలించిన రెవెన్యూ శాఖ అధికారులు

**పూడూరు, సెప్టెంబర్ 28 :** కాంగ్రెస్ పార్టీ నేత, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు కుటుంబ సభ్యులు తమ భూములను కబ్జాచేశారని బాధిత రైతు వడ్డె ఎల్లయ్య కుమారులు అనంతయ్య, రవి, రామయ్య, వెంకటయ్య ఆవేదన వ్యక్తంచేశారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మీర్జాపూర్ పంచాయతీ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 20లో 10 ఎకరాల భూమిలో కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు కూతుళ్లు గద్వాల విజయలక్ష్మి 2 ఎకరాలు, కవిత 3 ఎకరాలు, కుమారుడు వెంకటేశ్వర్‌రావు 5 ఎకరాలు కబ్జా చేశారని సోమవారం వారు మీడియా ఎదుట ఆరోపించారు. తాము ఈ విషయమై కోర్టులో కేసు వేశామని, కోర్టులో కేసు ఉండగా తాము ఎలాంటి సాగు చేయకపోయినా రైతు వడ్డే మల్లేశ్‌పై కేసు పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికార పార్టీలో ఉన్నందుకు తమపై కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సోమవారం రెవెన్యూ అధికారులు భూ పరిశీలనకు రావడంతో కేశవరావు కుమారుడు వచ్చి పోలీసులకు తమపైనే ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. భూమి పేర్లు మారిన అం శంపై అధికారులు పరిశీలించాలని కోరారు. కోర్టు తీర్పు వచ్చే వరకు భూమిలోకి ఎవరూ వెళ్లవద్దని ఎస్సై భరత్‌రెడ్డి తెలిపారు.



# (మొదటిపేజీ తరువాయి)

## బుల్లెట్ ట్రైన్ పేరిట..భూ దందా..

చెప్పారా? లేదా? ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన అసైన్డ్ భూములకు పట్టాలిస్తామని హామీ ఇచ్చింది కాంగ్రెసోళ్లు కాదా?' అని నిలదీశారు. గతంలో ఇందిరమ్మ ఇచ్చినట్టే ఇప్పుడు భూములు మళ్లీ ఇస్తామని చెప్పారని, పట్టాలివ్వాల్సిన వ్యక్తి మోసం చేస్తే పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫొటో పెట్టాలా? లేక రైతుల ఫొటోలు పెట్టాలా?' అని ప్రశ్నించారు. 'ఒకటి కాదు..రెండు కాదు.. 420 హామీలు, 420 మాటలు చెప్పి గెలిచి గద్దెనెకి ఇవ్వాళ గద్దలెక ప్రవర్తిస్తున్నోడిది పెట్టాలా? మనది పెట్టాలా? వాళ్లవే పెట్టాలె గదా?' తూర్పారబట్టారు. భూములు గుంజుకోవద్దని ప్రాధేయపడుతున్న రైతుల భూములపైకి పోలీసులను పంపి దండయా త్ర చేయడం సిగ్గుచేటని కేటీఆర్ మండిపడ్డారు. 'రేవంత్‌రెడ్డీ.. నిజంగా నీకు నీతి, నిజాయితీ ఉంటే.. నీ దగ్గర, ప్రభుత్వం దగ్గర కాగితాలుంటయి. 4 వేల మంది పోలీసులను పంపే అవసరం ఏమున్నది?' అని నిలదీశారు. ప్రభుత్వం వద్ద భూ పత్రాలుంటే వాటిని రైతులకు చూపించాలని డిమాండ్ చేశారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్‌కు బీఆర్ఎస్‌కు వ్యతిరేకం కా దని స్పష్టంచేశారు. ప్రాజెక్టుల అభివృద్ధికి తాము వ్య తిరేకం కాదని, అభివృద్ధి ముసుగులో రైతుల భూములు గుంజుకొని అన్యాయం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. రైతులకు పట్టాలివ్వకపోతే రాళ్లతో కొట్టాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ 'ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఏమన్నడు? మీకు పట్టాలివ్వకపోతే రాళ్లతో కొట్టుమన్నడు. రేవంత్‌రెడ్డేమో ఎమ్మెల్యేలు పార్టీ మారితే రాళ్లతో కొట్టుమన్నడు. రైతుల భూములకు పట్టాలిస్తలేడు.. మరి ఇప్పుడు ఎవర్ని కొట్టాలె? రేవంత్‌రెడ్డినా? ప్రకాశ్‌గౌడ్‌నా?' అని ప్రశ్నించారు.పట్టాలిప్పించే బాధ్యత నాదే

రైతులకు పట్టాలిప్పించే బాధ్యత తనదేనని బహదూర్‌గూడ రైతులకు కేటీఆర్ హామీ ఇచ్చారు. 'మీకు పకాగా నేను పార్టీ తరఫున ఇచ్చే మాట.. రెండేండ్ల తర్వాత కేసీఆర్ మీ అందరి దయతోని వస్తడు. మీ పట్టాలు మీకిచ్చి, మీ బహదూర్‌పల్లిలోనే మీటింగ్‌పెట్టి, ఇదే కార్తీక్‌రెడ్డి ఎమ్మెల్యేగా మీకు పట్టాలిస్తరు' అని భరోసా ఇచ్చారు. రైతుల తరఫున హైకోర్టుకు వెళ్లి న్యాయం కోసం పోరాడిన కార్తీక్‌రెడ్డి కృషిని ప్రస్తావించారు. 'ఏ కార్తీక్‌రెడ్డి అయితే ఇవ్వాళ హైకోర్టుకు పోయి మీకు న్యాయం చేసిండో.. ఇదే నాయకుడి చేతుల మీదుగా మీకు పట్టాలిప్పించే బాధ్యత నాది' అని భరోసా ఇచ్చారు. బహదూర్‌పల్లి రైతుల భూముల సమస్య పరిష్కారం కోసం బీఆర్ఎస్ వారి తరఫున నిలబడుతుందని హామీ ఇచ్చారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా నిలబడుతామని తేల్చిచెప్పారు. రైతులు ధైర్యంగా ఉండాలని, దుర్మార్గపు సర్కార్‌కు తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు ఎంత భూమి అవసరమో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనీస స్పష్టత లేదని సబిత విమర్శించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు పట్టాలు సిద్ధమైనా, ఎన్నికల కోడ్ రావడంతో ఇవ్వలేకపోయామని వివరించారు. మరోవైపు గతంలో మెట్రోరైల్ ప్రాజెక్టుకు అనుమతులు వస్తే ఎందుకు అడ్డుకున్నారని రేవంత్ సరారిను ప్రశ్నించారు. ఓవైపు 200 ఎకరాల్లో సీఎం సోదరులు నిర్మాణాలు చేపడుతున్నారని, అందుకోసమే తమ భూములు లాకుంటున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారని ప్రస్తావించారు. రైతుల పక్షాన న్యాయస్థానాల్లోనైనా సరే కొట్లాడుతామని, బాధితులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణలో ఓట్ల చోరీ వివాదం

జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలనలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, దానం నాగేందర్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహం నుండి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు కాంగ్రెస్ దాడికి బీజేపీ ఎదురు దాడి ప్రారంభించింది. రాజ్యాంగ వ్యవస్థలను బెదిరిస్తూ ప్రతిపక్షాలను అణగదొక్కడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బిజేపీ ఆరోపించింది. నెక్లెస్ రోడ్డులో ఎలక్షన్ కమిషన్‌పై కాంగ్రెస్ చేపట్టిన ర్యాలీని బిజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఓటమి భయంతో ఇటువంటి ర్యాలీలు చేపడుతోందని అన్నారు.

## అంతిమ యుద్ధానికి మేం సిద్ధంగా ఉన్నాం..

చమురును తాము అమ్ముకోగలిగే పరిస్థితి ఉండాలన్నారు. ఘర్షణలు తగ్గించేలా చర్చలతో పరిష్కారాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. అలాంట ప్పుడు తాము హర్మూజ్‌ను తెరిచేందుకు సుముఖంగానే ఉంటామని అరాగ్చీ పేర్కొన్నారు. అమెరికాకు చెందిన కింగ్‌ఫిష్ డ్రోన్ గూఢచర్యానికి పాల్పడుతోందని, దానిని తాము స్వాధీనం చేసుకున్నామని ఇరాన్ ప్రకటించింది.

## త్వరలోనే ఖైరతాబాద్ ఉప ఎన్నిక..

మార్గం సుగమమైంది. ఇక ఈ అసెంబ్లీపై ఎన్నికల సంఘం త్వరలోనే తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు ఉప ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్ ను ఎన్నికల సంఘం ప్రకటించాల్సి ఉంది. ఇక ప్రస్తుతం తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కిన క్రమంలో హైదరాబాద్ లో మరోసారి అసెంబ్లీ ఉప ఎన్నిక రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకోనుంది. ఇప్పటికే అధికార కాంగ్రెస్- ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ఎవరు విజయం సాధిస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గత ఎన్నికల మాదిరిగానే బీఆర్ఎస్ విజయం సాధిస్తుందా..? లేక అధాకార కాంగ్రెస్ ను విజయం వరిస్తుందా..? వేచి చూడాల్సిన అవసరం ఉంది.

# హైదరాబాద్ కు దగ్గరలోనే పల్లెటూరి అనుభూతి..



## ఒక్కసారైనా వెళ్లి తీరాల్సిందే..

హైదరాబాద్, సెప్టెంబర్ 28 : హైదరాబాద్ విశ్వ నగరంగా మారుతోంది. ఎటు చూసినా పెద్ద పెద్ద భవనాలు.. రద్దీ రోడ్లు.. ట్రాఫిక్ జామ్ లు, రణగొణధ్వనులతో అలసిపోతుంటారు. ఇక వీకెండ్ వచ్చిందంటే సినిమాలు.. పబ్ లు.. మాల్స్, రెస్టారెంట్ల చుట్టూ తిరుగుతుంటారు. కానీ హైదరాబాద్ నగరానికి కాస్త దూరంగా ఓ అందమైన పల్లెటూరి అందాలను మరిపించే విలేజ్ రిసార్ట్ ఉందన్న సంగతి మీకు తెలుసా..? ఇక్కడకు వెళ్తే గోదావరి జిల్లాల్లోని గ్రామాలకు వెళ్లామా..? అన్న అనుభూతి కలుగుతుంది. చుట్టూ ఎటు చూసినా పచ్చని పల్లెటూరి వాతావరణం.. సంప్రదాయ ఆటలు, ఫామ్ యానిమల్స్ తో అస్సలు టైమే తెలియదు.. ఇక్కడకు వెళ్తే త్వరగా తిరిగి రావాలని అనిపించదు. చిన్ననాటి ఆటలను మళ్లీ ఆడుకోవచ్చు. ఇక్కడ 50 కు పైగా పండ్ల చెట్లు ఉంటాయి. ఫిషింగ్ పాండ్ కూడా ఉంది. అక్కడ సరదాగా చేపలు పడుతూ ఎంజాయ్ చేసే అవకాశం ఉంటుంది. అలాగే ఫిషింగ్ పాండ్ దగ్గర ప్రశాంతంగా కొంత సమయం గడపొచ్చు. అలాగే ఇక్కడ రాత్రి పూట బస చేసే అవకాశం కూడా ఉంది. హైదరాబాద్ కు కేవలం 50 కి. మీ. దూరంలోనే ఉంది. ఈ కుముదాపురం ఎథ్నిక్ విలేజ్ రిసార్ట్. సిటీ లైఫ్ కు దూరంగా కొంత విరామం తీసుకుని కుటుంబంతో, భాగస్వామితో, స్నేహితులతో సరదాగా సమయం గడిపేందుకు ఈ విలేజ్ రిసార్ట్ మంచి ఆప్షన్ అని చెప్పొచ్చు. కుముదాపురం విలేజ్ ఎథ్నిక్ రిసార్ట్ కు వెళ్తే చిన్నప్పుడు ఆడిన ఆటలను మళ్లీ ఆడుకోవడంతో పాటు.. ఇప్పటి జనరేషన్ పిల్లలకు పల్లెటూరి వాతావరణాన్ని చూపించడం, ఫామ్ లో పశువులు, జంతువులను చూడటం, పచ్చని పొలాల్లో సమయం గడపడం వంటి అనుభవాలు ఇక్కడ లభిస్తాయి. అలాగే ఈ విలేజ్ లో రోజంతా గడిపి ఇక్కడే రిసార్ట్ లో ఉన్న ఇన్ హౌస్ రెస్టారెంట్ లో భోజనం చేయొచ్చు. ఇక్కడ సౌత్ ఇండియన్ వంటకాలు అందుబాటులో ఉంటాయి. ఇక ఈ రోజుల్లో ప్రతి ఇంట్లో పెంపుడు జంతువులు ఉన్న సంగతి తెలిసిందే. అయితే పెంపుడు జంతువులను ఎక్కడికి వెళ్లినా తీసుకెళ్తుంటారు. అలాంటి వారి కోసం ఇక్కడ ప్రత్యేకమైన వసతిని ఏర్పాటు చేశారు. ఈ రిసార్ట్ పెట్ ఫ్రెండ్లీగా ఉన్న నేపథ్యంలో మీ పెట్ తో కలిసి ఫ్యామిలీ ట్రిప్ ప్లాన్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇక కేవలం ఒక్కరోజు వెళ్లి రావాలనుకునేవారికే కాకుండా రాత్రి అక్కడే ఉండాలనుకునేవారికి కూడా వివిధ రకాల వసతి సదుపాయాలు ఉన్నాయి. ఈ కుముదాపురం రిసార్ట్ బూర్గుల ప్రాంతంలోని షాద్ నగర్ లో ఉంది. బెంగళూరు హైవేకు దగ్గరగా ఈ రిసార్ట్ ఉంది. హైదరాబాద్ నుంచి కేవలం 50 కి.మీ. దూరంలోనే ఈ రిసార్ట్ ఉంది.

# మా భూములు మాకివ్వండి..

- కాంగ్రెస్ సర్కార్ వంచనపై కన్నెర్ర
- ఫ్యూచర్‌సిటీ వద్దు, బుల్లెట్ రైలు మాకొద్దు..
- తిరగబడిన ఫార్మా రైతులు
- ఫార్మా పేరిట భూసేకరణ.. ఫ్యూచర్‌సిటీకి మళ్లింపు
- భూములు తిరిగిస్తామని నమ్మించి మోసం చేశారు
- కాంగ్రెస్ సర్కార్ కపటనీతిపై కదంతొక్కిన బాధితులు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే క్యాంప్‌ఆఫీస్‌ను ముట్టడి
- యాచారం మండలంలోని నాలుగు గ్రామాల రైతులు
- అక్కడే వంటావార్పు.. బతుకమ్మ ఆటలాడి ఆందోళన
- ప్రభుత్వం దిగొచ్చేదాకా తమ పోరు ఆగదని స్పష్టీకరణ



హైదరాబాద్, సెప్టెంబర్ 28 : కేసీఆర్ తలపెట్టిన గ్రీన్ ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులు కాంగ్రెస్ సర్కార్‌పై కన్నెర్రజేశారు. భూములను తిరిగి ఇస్తామంటూ ఎన్నికల ముందు నమ్మించి ఓట్లేయించుకొని, అధికారంలోకి రాగానే ముఖం చాటేయడమే గాక ఫ్యూచర్‌సిటీ పేరిట కబ్జా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మంత్రులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడాన్ని నిరసిస్తూ ఫార్మా బాధిత రైతులు సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. యాచారం మండల పరిధిలోని మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల నుంచి వందలాదిగా చేరుకున్న రైతులు.. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవటంతో అక్కడే బైఠాయించి ధర్నాకు దిగారు.ఎమ్మెల్యే వచ్చేదాకా తాము ఇక్కడినుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. వంటావార్పు చేసి అక్కడే భోజనాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే తీరుకు నిరసనగా బతుకమ్మ ఆడారు. అక్కడినుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లారు. అయితే ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఓవైపు ముఖ్యమంత్రి ఫార్మాసిటిని రద్దుచేశామని చెప్తూనే మరోవైపు ఫ్యూచర్‌సిటీకి భూములను ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అదేవిధంగా తమ భూములను లాక్కోవడానికి బుల్లెట్‌ట్రైన్ కోసం మరోమారు భూసేకరణ చేస్తున్నారని, తమకు ఎలాంటి ఉపయోగం లేని బుల్లెట్ రైళ్లు వద్దని, తమ భూములు తమకే కావాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగొచ్చేదాకా ఉద్యమం ఆగదని తేల్చిచెప్పారు.

నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాలో దేశంలోనే అతి పెద్ద గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటును చేపట్టింది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల పరిధిలో 19,333.20 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించి, 14వేల ఎకరాలను భూసేకరణ ద్వారా తీసుకున్నది. రైతుల నుంచి తీసుకున్న భూముల్లో భూసేకరణ నోటిఫికేషన్‌లో పొందుపరిచిన ప్రకారం ఫార్మాసిటీ ఏర్పాటుచేస్తామని, ఒకవేళ చెప్పిన విధంగా ఇతర అవసరాలకు వినియోగిస్తే రైతుల భూమి తిరిగి పొందవచ్చని షరతు విధించింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫార్మాసిటీ రైతులను రోడ్డున పడేసింది. మూడేండ్ల నుంచి వివిధ రూపాల్లో నిర సనలు, ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం మొండివైఖరి వీడటం లేదు. ఫార్మా రైతులను అరిగోస పెడుతున్నది.

## శ్వేతపత్రం విడుదల చేయాలి..



- ఆరోపణలు నిరూపించ కుంటే క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- మూడేండ్లలో ప్రభుత్వం చేసిందేంటి: కొండూరు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 28 : సిరిసిల్లలో భూ అక్రమాలు జరిగాయంటూ అసెంబ్లీలో చేసిన ఆరోపణలపై సీఎం రేవంత్‌రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. ఆరోపణలు నిరూపించలేకపోతే సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ప్రత్యేక స్థానం ఉన్నదని, నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా జరిగిందో వారికి తెలుసని స్పష్టం చేశారు. సిరిసిల్లకు మూడేండ్లలో కాంగ్రెస్ సర్కార్ ఏం చేసిందని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో సిరిసిల్లకు వచ్చిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి వస్తున్నారని పేర్కొన్నారు.గతంలో ఇచ్చిన హామీలు అమలు చేసేలా స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నేతన్నలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు వరర్ టూ ఓనర్ పథకాన్ని పునరుద్ధరించి అమలు చేయాలని, చేనేత, మరమగ్గ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి అండగా నిలువాలని కోరారు. సిరిసిల్లకు ఇచ్చిన హామీల్లో ఈ మూడేండ్లలో ఏం అమలు చేశారో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు చెప్పాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు డిమాండ్ చేశారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మలపేట రిజర్వాయర్‌ను పూర్తి చేసి, లిఫ్ట్ ద్వారా నీటిని తరలించేలా చర్యలు చేపట్టిందని, మిగిలిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, న్యాలకొండ రాఘవరెడ్డి, కంబాల మల్లారెడ్డి, దార్నం లక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, జకుల నాగరాజుయాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## నేతన్నలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి

- సిరిసిల్ల సభలో రేవంత్‌రెడ్డి ప్రకటన చేయాలి: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 28 : చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ రేవంత్ సర్కార్ నెరవేర్చాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కోర్కళ్ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం సర్వసభ్య సమావేశం లో సోమవారం మాట్లాడారు. ఈ ప్రభుత్వం దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, బతుకమ్మ చీరల కాంట్రాక్ట్ కూడా వేరే వారికి ఇచ్చి కార్మికుల పొట్ట కొట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఈ నెల 30న సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు వస్తున్నందున ఎన్నికల సమయంలో చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్యాష్‌కట్ కూడా మాఫీ చేయాలని కోరారు. మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని, చెప్పిన ప్రతి పనిని తప్పకుండా చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.

## సోయా రైతును ముంచిన నకిలీ విత్తనాలు

- ఆదుకోవాలని 'ప్రజావాణి'లో కలెక్టర్‌కు వేడుకోలు



ఆదిలాబాద్, సెప్టెంబర్ 28 : ఆదిలాబాద్ జిల్లాలో సోయా రైతులను నకిలీ విత్తనాలు నట్టేట ముంచాయి. ఎల్ నినో నేపథ్యంలో ప్రభుత్వం, అధికారుల సూచనల మేరకు ఆదిలాబాద్ జిల్లాలో రైతులు పత్తికి బదులు స్వల్పకాలిక పంట అయిన సోయాను దాదాపు లక్ష ఎకరాల్లో సాగు చేశారు. జూన్ మొదటి వారంలో వేసిన సోయా అక్టోబర్ మొదటి, రెండో వారాల్లో పంట చేతికొస్తుంది. ప్రస్తుతం పంట కోతకు సిద్ధంగా ఉన్న దశలో కాయల్లో మొలకలు రావడంతో రైతులు నష్టపోయా రు. సాధారణంగా కాయలు ఎండిపోయిన సమయంలో వానలు పడితే మొలకలు వస్తాయని, జిల్లాలో వేసవిని తలపిస్తున్న వాతావరణం ఉండగా మొలకలు వచ్చే అవకాశం లేదని, నకిలీ విత్తనాల ఇందుకు కారణమని రైతులు అంటున్నారు. ఈ మేరకు సోమవారం వారు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. లక్షల రూపాయల పెట్టుబడులతో సాగు చేసిన సోయా పంటను నకిలీ విత్తనాలు కారణంగా నష్టపోయామని, తమకు నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## బడుల మూత.. బార్ల మోత..

### ఇది తుగ్లక్ పాలనా?

### 'ఎక్స్' వేదిక కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్,సెప్టెంబర్-27 : రాష్ట్రంలో క్యూర్ పరిధిలో కొత్తగా 41 '2బీ' బార్ల ఏర్పాటు.. మరోవైపు పబ్లిక్ స్కూళ్ల పేరిట సమీపంలోని పాఠశాలల విలీనం చేయాలని నిర్ణయించిన కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం వివిధ దినపత్రికల్లో ప్రచురితమైన కథనాలను తన పోస్ట్‌కు ట్యాగ్ చేస్తూ ప్రభుత్వాన్ని ఎండగట్టారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యనందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సర్కార్ బడులను మూసివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.మరోవైపు విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని ధ్వజమెత్తారు. ఇది తుగ్లక్ పాలనా? ప్రజాపాలనా? అని నిలదీశారు. వెంటనే 41 బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటు, 105 టీఎపీఎస్ (తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల) పేరిట బడుల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## కృష్ణజింకను వేటాడిన ముఠా అరెస్ట్

- మరికల్ అటవీ ప్రాంతంలో వేట
- రాయికల్ టోల్ ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు



షాద్‌నగర్, సెప్టెంబర్ 28 : కొందరు వ్యక్తులు కృష్ణ జింకను వేటాడి దాని మాంసాన్ని తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన ఘటన రంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్నది. షాద్‌నగర్ డీసీపీ శిరీష సోమవారం తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని ఈది బజార్‌కు చెందిన ఎండీ హాజీవుద్దీన్ స్పోర్ట్స్‌మెన్‌గా ఉన్న సమయంలో అదే కోటాలో తుపాకీ వినియోగానికి అనుమతులు పొందాడు. ఆ తరువాత అతను రియల్ ఎస్టేట్ వ్యా పారిగా మారాడు.హాజీవుద్దీన్ తన స్నేహితులైన హైదరాబాద్‌కు చెందిన మీర్ ముక్తార్ అలీ, ఎండీ తాజ్‌మోల్, సయ్యద్ సల్మాన్‌అలీ, ఎండీ అబ్దుల్ అజీజ్, సంగారెడ్డికి చెందిన ఖుర్రం ఖాన్, రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌కు చెందిన ఎండీ అఫ్రోజ్‌ఖాన్, నారాయణపేట జిల్లా ఉట్కూర్ వాసి ఎండీ రియాజ్‌తో కలిసి ఈ నెల 26న నారాయపేట జిల్లా మరికల్ ప్రాంతంలో ఎండీ హాజీవుద్దీన్ తుపాకీతో కృష్ణ జింకలను వేటాడారు. ఇందులో ఓ జింక మృతి చెం దింది. పక్కా సమాచారం తెలుసుకున్న ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు ఫరూఖ్ నగర్ మండలం రాయికల్ టోల్‌ప్లాజా వ ద్ద వాహనాలను తనిఖీ చేసి వీరిని పట్టుకున్నారు. నిందితుల నుంచి తుపాకీ, 19 బుల్లెట్లు స్వాధీనం చేసికుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు డీసీపీ శిరీష తెలిపారు.

బలగం BALAGAM
balagamtv100@gmail.com

# బ్యాంకింగ్ రంగంలో కరెన్సీ సునామీ..

# ఒక్క దెబ్బతో లక్ష కోట్లు!

బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న అదనపు నగదును బయటకు లాగేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) సరికొత్త వ్యూహానికి తెరతీసింది. దశాబ్ద కాలంలో ఎనడూ లేనివిధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ. లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ బాండ్లను నికరంగా విక్రయించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆర్‌బీఐ ఈ స్థాయిలో మార్కెట్లోకి బాండ్లను వదలడం ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత కొంతకాలంగా బ్యాంకింగ్ వ్యవస్థలో విపరీతంగా నగదు నిల్వలు పెరిగిపోయాయి. డాలర్ల సమీకరణ కోసం ప్రత్యేక మార్గాలను అనుమతించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న సమయంలో విదేశీ మారకద్రవ్య నిల్వలను కాపాడుకోవడానికి ఈ నిర్ణయం దోహదపడింది. అయితే దీనివల్ల ఓవర్‌నైట్ వడ్డీ రేట్లు ఆర్‌బీఐ నిర్దేశిత పాలసీ రేట్ల కంటే పడిపోయాయి. ఈ అనూహ్య పరిణామాన్ని సరిదిద్దేందుకే సెంట్రల్ బ్యాంక్ ఈ భారీ విక్రయాలకు పూనుకుంది. ఆర్‌బీఐ వద్ద ఉన్న 2015 ఆర్థిక సంవత్సరం నాటి డేటా ప్రకారం.. ఇప్పటివరకు ఉన్న రికార్డు 2018 నాటిదే. పెద్ద నోట్ల రద్దు సమయంలో తలెత్తిన పరిణామాలను ఎదుర్కొనేందుకు ఆ సమయంలో రూ. 90,000 కోట్ల విలువైన బాండ్లను సెంట్రల్ బ్యాంక్ విక్రయించింది. సరిగ్గా అదే స్థాయిలో ఇప్పుడు ఏకంగా లక్ష కోట్ల మార్కును తాకడం విశేషం. అంతేకాదు, డిసెంబర్ నాటికి ఈ మొత్తం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. మార్కెట్ పరిస్థితులు చూస్తుంటే రానున్న కాలంలోనూ ఆర్‌బీఐ తన జోరు తగ్గించేలా కనిపించడం లేదు. అక్టోబర్, నవంబర్ మాసాల్లోనే మరో రూ. లక్ష నుంచి లక్షన్నర కోట్ల వరకు బాండ్లను విక్రయించే అవకాశం ఉందని ఆనంద్ రాఠీ గ్లోబల్ ఫైనాన్స్ ట్రెజరీ హెడ్ హర్సిమ్రన్ సాహ్ని తెలిపారు. మరోవైపు, దీర్ఘకాలిక బాండ్లపై పెట్టుబడులను తగ్గించుకోవడం మంచిదని ఐసీబీసీ ట్రెజరీ హెడ్ అలోక్ శర్మ అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడానికి వడ్డీ రేట్లను మరింత పెంచే ఛాన్స్ ఉందని మెజారిటీ నిపుణులు భావిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రెండో అర్ధభాష రుణ ప్రణాళికలో 15, 30, 40 ఏళ్ల సెక్యూరిటీల ద్వారా నిధులు సమీకరించాలని నిర్ణయించింది. దీంతో బాండ్ మార్కెట్లో ధరలు పడిపోతాయన్న ఆశలు ఆవిరయ్యాయి. ప్రభుత్వ ఈ నిర్ణయం వల్ల స్వల్పకాలికంగా ఈల్డ్ కర్వ్ లో మార్పులు వస్తాయని ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్ ఫిక్సెడ్ ఇన్‌కం హెడ్ వికాస్ గార్గ్ పేర్కొన్నారు. మరోవైపు, దేశ ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకునే రుణ సమీకరణ చేపడుతున్నామని, దీనివల్ల భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక రిస్క్‌లు తగ్గుతాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.




# యువకుడ్ని చెంపదెబ్బ కొట్టిన ఢిల్లీ మంత్రి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :** దేశ రాజధాని ఢిల్లీ పీడబ్ల్యూడీ మంత్రి పర్వేశ్ వర్మ కు పోలీసులు బిగ్ షాక్ ఇచ్చారు. తాజాగా తిలక్ నగర్ లోని రోడ్డు తనిఖీల్లో భాగంగా ఆయన అక్కడ ఓ యువకుడి చెంపపై కొట్టిన ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం చెలరేగడంతో రంగంలోకి దిగిన పోలీసులు మంత్రి పర్వేశ్ వర్మపై నాన్- కాగ్నిజబుల్ రిపోర్ట్(చీజ=) ను నమోదు చేశారు. సెప్టెంబర్ 27 ఆదివారం రోజున పశ్చిమ ఢిల్లీలోని తిలక్ నగర్ లో రోడ్డు నాణ్యతను తనిఖీ చేస్తున్న సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. అయితే ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వివాదం మరింతగా ముదిరింది. మరోవైపు ఢిల్లీలోని ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తమ విధులను నిర్వర్తించకుండా అడ్డుకున్నారని అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇక ఢిల్లీ మంత్రి పర్వేశ్ వర్మపై నాన్- కాగ్నిజబుల్ రిపోర్ట్ నమోదైన విషయంలో ఆయన ఉద్దేశపూర్వకంగానే యువకుడిపై దాడికి పాల్పడ్డాడని గ్రహించి భారతీయ న్యాయ సంవిధాన్ చట్టం ప్రకారం సెక్షన్ 115 కింద ఎన్సీఆర్ నమోదు చేసింది. బాధితుడు సాహిబ్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. అయితే చీజ= నమోదు చేసినంతమాత్రాన వెంటనే దర్యాప్తు ప్రారంభం కాదు. ఎఫ్ఐఆర్ మాదిరి కాకుండా ఈ ఘటనపై దర్యాప్తు చేయాలంటే మేజిస్ట్రేట్ నుంచి అనుమతి ఉండాలి. అలాగే ఎలాంటి వారెంట్ లేకుండా పోలీసులు ఎట్టిపరిస్థితుల్లోనూ అరెస్ట్ చేయడానికి వీలు లేదు. ఇక ఈ ఘటన ఆదివారం జరగ్గా.. ఘటన సమయంలో రోడ్డు పనుల తనిఖీలో భాగంగా తిలక్ నగర్ నియోజకవర్గంలో ఢిల్లీ మంత్రి పర్వేశ్ వర్మ పర్యటించారు. ఆయన వెంట తిలక్ నగర్ ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్ కూడా ఉన్నారు. అయితే రోడ్డు నాణ్యతపై ఇరు వర్గాల మధ్య పరస్పర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో తనను వీడియో తీస్తున్న ఓ యువకుడి ఫోన్ లాక్కోవడమే కాకుండా అతడి చెంప చెల్లుమనిపించారు మంత్రి పర్వేశ్ వర్మ. దాంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.

# లోన్లు తీసుకున్న వారికి బ్యాడ్ న్యూస్.. భారీగా పెరగనున్న వడ్డీ!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :** దేశంలో మళ్లీ రుణాలు భారం కానున్నాయా? ఈ ప్రశ్నకు ఆర్థిక నిపుణులు అవుననే సమాధానం ఇస్తున్నారు. రాబోయే అక్టోబర్ నెలలో జరగనున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య పరపతి సమీక్ష సమావేశంలో వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ముడి చమురు ధరల మంట కారణంగా ఆర్‌బీఐ తన రెపో రేటును నా. 25 బేసిస్ పాయింట్లు పెంచే ఛాన్స్ ఉందని మార్కెట్ వర్గాలు బలంగా అంచనా వేస్తున్నాయి. దేశంలో సామాన్యుడి నడ్డి విరుస్తున్న ద్రవ్యోల్బణం ఒక్కసారిగా విస్తరిస్తోంది. ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం.. గత జనవరిలో కేవలం 22 రకాల వస్తువుల ధరలు మాత్రమే ద్రవ్యోల్బణాన్ని ప్రభావితం చేయగా, ఆగస్టు నాటికి ఆ సంఖ్య ఏకంగా 51కి చేరుకుంది. అంటే నిత్యావసరాలు, కూరగాయలు, ఇతర వస్తువుల ధరల పెరుగుదల కేవలం కొన్నింటికే పరిమితం కాకుండా అన్నింటికీ పాకింది. దీంతో రిటైల్ ద్రవ్యోల్బణం 4.82 శాతానికి పెరగగా, ఆహార పదార్థాల ధరల పెరుగుదల ఏకంగా 5.66 శాతానికి ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు విపరీతంగా పెరగడం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద తలనొప్పిగా మారింది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు ఏకంగా 102 డాలర్లకు



చేరుకుంది. గతంలో ఆర్‌బీఐ అంచనా వేసిన దానికంటే ఇది చాలా ఎక్కువ. ఈ చమురు ధరల పెరుగుదల ప్రభావంతో రాబోయే రోజుల్లో దేశంలో ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నిర్దేశిత గరిష్ట పరిమితి అయిన 6 శాతాన్ని దాటే ప్రమాదం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. కేవలం దేశీయ కారణాలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మారుతున్న ఆర్థిక పరిస్థితులు కూడా వడ్డీ రేట్ల పెంపునకు దారితీస్తున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ వంటి ప్రముఖ సంస్థలు ఇప్పటికే వడ్డీ రేట్లను పెంచేశాయి. ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో, మన దేశంలోనూ పెట్టుబడులు పారిపోకుండా ఉండేందుకు, రుణాలు ఖరీదైనవిగా మారే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనివల్ల బాండ్ ఈల్డ్స్ పెరిగి రుణాలు మరింత ప్రియం కానున్నాయి. అక్టోబర్ పాలసీలో రేట్ల పెంపు ఉంటుందని కొందరు నిపుణులు గట్టిగా చెబుతున్నారు. మోతీలాల్ ఓస్వాల్ సంస్థకు చెందిన రీసెర్చ్ అనలిస్ట్ రాధికా పిప్లానీ మాట్లాడుతూ.. చమురు ధరలు ఇదే విధంగా ఉంటే ఆర్‌బీఐ ఎలాంటి జాప్యం చేయకుండా అక్టోబర్‌లోనే రేట్లు పెంచే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అయితే, మరోవైపు శ్రీరామ్ ఫైనాన్స్ చీఫ్ ఎకనామిస్ట్ అపూర్వ జావడేకర్ మాత్రం ఈ పెంపు చాలా స్వల్పంగానే ఉంటుందని, వృద్ధి మందగిస్తున్న నేపథ్యంలో రేట్లు విపరీతంగా పెంచే అవకాశం లేదని విశ్లేషించారు. కారణాలు ఏమైనప్పటికీ, రాబోయే రోజుల్లో సామాన్యులకు ఈఎంఐల భారం పెరిగే సూచనలు మాత్రం బలంగా కనిపిస్తున్నాయి.

# పాకిస్థాన్ లో భారత్ అధికారులు కీలక సమావేశం..



భారత్- పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు నెలకున్న సంగతి తెలిసిందే. గతేడాది ఏప్రిల్ 22 న పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. అలాగే ఆ దేశంపై పలు కఠిన ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంతగా పరిస్థితులు మారాయి. అయితే పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అక్కడ జరిగే షాంఘై సహకార సంస్థ నేషనల్ కోఆర్డినేటర్ల సమావేశం నిమిత్తం భారత బృందం ఇస్లామాబాద్ చేరుకుంది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు అంటే మూడు రోజుల పాటు జరిగే ఈ ఉన్నత స్థాయి సమావేశంలో భారత్, పాకిస్థాన్ లతో పాటు రష్యా, చైనా, ఇరాన్, బెలారస్ సహా సభ్య దేశాల ప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ మేరకు భారత బృందానికి విదేశాంగ మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ అలోక్ దిమ్రి నాయకత్వం వహిస్తున్నారు. అలాగే అలోక్ దిమ్రి భారత్ తరపున ఎస్సీఓకు నేషనల్ కో- ఆర్డినేటర్ గా ఉన్నారు. ఇక షాంఘై సహకార సంస్థలో ప్రస్తుతం రష్యా, భారత్, ఇరాన్, కజకిస్తాన్, కిర్గిస్థాన్, పాకిస్థాన్, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్, చైనా సభ్య దేశాలుగా ఉన్నాయి. భారత్, పాకిస్థాన్ ఈ కూటమిలో 2017లో భాగస్వాములుగా చేరాయి. ఈ ఏడాది అధ్యక్ష పదవిని కిర్గిస్థాన్ నుంచి సెప్టెంబర్ 1 న భారత్ తీసుకుంది. వచ్చే ఏడాది ఆగస్టులో పాకిస్థాన్ లో జరిగే ఎస్సీఓ సమ్మిట్ లో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్ 28-30 వరకు ఎస్సీఓ కోఆర్డినేటర్ల సమావేశం జరగనుంది. ఇక వచ్చే ఏడాది నిర్వహించే ఎస్సీఓ సమావేశానికి కూటమి సభ్య దేశాలతోపాటు భారత ప్రధాని నరేంద్ర మోదీకి కూడా ఆహ్వాన పత్రిక పంపిస్తుందని ఇప్పటికే పాకిస్థాన్ హింట్ ఇచ్చింది. ఇక మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశంలో పాకిస్థాన్ సరికొత్త థీమ్ ను ఎంచుకుంది. టర్నింగ్ విజన్ ఇన్ టూ యాక్షన్.. కనెక్టివిటీ, ఇన్నోవేషన్ అండ్ షేర్డ్ ప్రాస్పెరిటీ థీమ్ గా పేర్కొంది పాకిస్థాన్. ఈ థీమ్ లో భాగంగా సభ్య దేశాల విజన్ ను, ప్రాధాన్యతను ముందుకు తీసుకెళ్లడం, ఎస్సీఓలో ఆ దేశాల సహకారాన్ని మరింత బలోపేతం చేయడం కోసం తమ దేశం అన్ని కూటమి దేశాలతో కలిసి పనిచేస్తుందని స్పష్టం చేసింది. ఇక 2024 లో పాకిస్థాన్ లో జరిగిన ఇదే సమావేశానికి విదేశాంగ మంత్రి జై శంకర్ హాజరైన సంగతి తెలిసిందే.

# అరేబియా సముద్రానికి ఇరాన్ వార్..!

## ట్రంప్ కు ఖమేనీ ఘాటు వార్నింగ్..!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :** ఇరాన్-అమెరికా మధ్య సాగుతున్న యుద్ధం మరింత తీవ్రమయ్యేలా కనిపిస్తోంది. తాజాగా ఇరాన్ ప్రతిపాదించిన సంధి ఒప్పందాన్ని తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. నవంబర్ లో మధ్యంతర ఎన్నికలు అయిపోగానే ఆ దేశంపై దాడుల్ని తీవ్రతరం చేస్తామని ప్రకటించారు. దీంతో ఇరాన్ కూడా ఘాటుగా కౌంటర్ ఇచ్చింది. అరేబియా సముద్రం నుంచి విదేశీ బలగాలను తరిమికొడతామంటూ ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ హెచ్చరించారు. దేశ దక్షిణ తీరానికి సమీపంలోని జలాల నుండి తమ శత్రువులు ఇప్పటికే వెనక్కి తగ్గేలా ఇరాన్ బలగాలు ఒత్తిడి తెచ్చాయని ఖమేనీ పేర్కొన్నారు. ఇరాన్ మీడియా విడుదల చేసిన



ఒక లిఖితపూర్వక ప్రకటనలో ఖమేనీ.. హార్ముజ్ జలసంధిని జాతీయ ప్రతిఘటనకు కీలకమైన ప్రదేశంగా అభివర్ణిస్తూ, ఇరాన్ సాయుధ బలగాలు ఘర్షణకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కొందరు తమను ప్రపంచంలో నాల్గవ అగ్రరాజ్యంగా చూస్తున్నారని, శత్రు బలగాలు అరేబియా సముద్రం దాటి వెళ్ళడానికి సాహసించడం లేదన్నారు. త్వరలోనే అరేబియా సముద్రం నుండి వారి ఉనికిని తుడిచిపెట్టే రోజు వస్తుందన్నారు. తమ ప్రజలు దేశవ్యాప్తంగా కూడళ్లను, వీధులను తమ బాధ్యతాయుతమైన ఉనికితో నింపుతున్నారన్నారు. దేశం చుట్టూ ఉన్న జలాల్లో ఇరాన్ బలగాలు తమ శత్రువులకు గణనీయమైన నష్టాలను కలిగించాయని ఖమేనీ పేర్కొన్నారు. గతంలో విదేశీ బలగాలు ఇరాన్ దక్షిణ సముద్రాల్లో సంచరించాయని, అయితే ఆ తర్వాత వారిని వెనక్కి తరిమివేశారని తెలిపారు. దేశీయ ఐక్యతను చాటిచెప్పే ప్రయత్నంలో, వివిధ జాతి, సామాజిక నేపథ్యాలకు చెందిన ఇరానీయులు జలసంధిపై దేశ వైఖరికి మద్దతుగా నిలుస్తున్నారని ఖమేనీ తెలిపారు. ఇరాక్‌తో జరిపిన ఎనిమిదేళ్ల యుద్ధానికి, హిజ్బుల్లా నాయకుడు సయ్యద్ హసన్ నస్రల్లా వర్ధంతిని పురస్కరించుకుని జరుపుకునే పవిత్ర రక్షణ వారోత్సవాల సందర్భంగా ఖమేనీ ఈ సందేశాన్ని విడుదల చేశారు. ఇరాన్ స్వాతంత్రాన్నిదెబ్బతీయడానికి పాశ్చాత్య శక్తులు ప్రయత్నిస్తున్నాయని, ఆ సంఘర్షణ నుండి ఇస్లామిక్ రిపబ్లిక్ మరింత బలంగా బయటపడిందని ఖమేనీ పేర్కొన్నారు. 1953లో ఇరాన్ ప్రభుత్వంపై అమెరికా జరిపిన తిరుగుబాటును కూడా ప్రస్తావిస్తూ, విదేశీ శక్తులు ఒకప్పుడు మానసిక ఒత్తిడిని, బెదిరింపులను ఉపయోగించి 25 సంవత్సరాల పాటు ఈ దేశ సంపదను దోచుకున్నాయని గుర్తుచేశారు. తమ మధ్య విభేదాలు ఉన్నప్పటికీ ఇరానీయులు దేశానికి అండగా నిలిచారని అన్నారు.

# పండుగల ముంగిట పసిడి ప్రియులకు బిగ్ రిలీఫ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :** పండుగ సీజన్ సమీపించిన తరుణంలో పసిడి ప్రియులకు భారీ ఊరట లభిస్తోంది. కొద్ది రోజులుగా వరుసగా రికార్డు ధరలతో దూసుకుపోయిన బంగారం, వెండి ధరలు అనూహ్యంగా దిగివచ్చాయి. దేశీయ రిటైల్ మార్కెట్ లో కిందటి వారంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములప గరిష్టంగా 3,160 రూపాయల వరకు తగ్గింది. 22 క్యారెట్ల బంగారం ధరలో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. 10 గ్రాముల ధరలో రూ. 2,900 మేర క్షీణించింది.ఈ ధరల తగ్గుదలకు ప్రధాన కారణం అంతర్జాతీయ విపణిలో చోటుచేసుకుంటోన్న పరిణామాలేనని విశ్లేషకులు స్పష్టం చేస్తోన్నారు. గ్లోబల్ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధరలు శనివారం నాటికి 2.1 శాతం మేర పడిపోయాయి. ఔన్స్‌కు 4,282.98 డాలర్లకు పరిమితం అయ్యాయి. ఈ ధరల క్షీణత తాత్కాలికమేనని ప్రముఖ అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ ఫర్మ్ జెఫరీస్ గ్లోబల్ హెడ్ క్రిస్ వుడ్ అంచనా వేశారు. దీర్ఘకాలంలో బంగారం ధర రికార్డుస్థాయికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రేటు ప్రస్తుతం రూ.1,52,830 వద్ద స్థిరపడగా, 22 క్యారెట్ల ధర రూ.1,40,100 వద్ద ట్రేడ్ అయింది. ఆర్థిక రాజధాని ముంబైతో పాటు కోల్‌కతాలో 24 క్యారెట్ల పసిడి రూ.1,52,680 వద్ద కొనసాగగా 22 క్యారెట్ల రేటు రూ.1,39,950 వద్ద నిలిచింది. హైదరాబాద్‌లో బంగారం ధరలు ముంబైతో సరితూగాయి. ఇక్కడ 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,52,680 వద్ద ఉండగా, 22 క్యారెట్లు 10 గ్రాములకు రూ.1,39,950 వద్ద స్థిరపడింది.చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,52,730, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,000 గా



రికార్డయింది. బెంగళూరు, పుణె నగరాల్లోనూ ఇవే ధరలు ట్రేడవుతున్నాయి. సిలికాన్ సిటీ బెంగళూరులో 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,39,950 కాగా 24 క్యారెట్లు రూ. 1,52,680 వద్ద నిలిచింది. కిలో వెండి ధర ఏకంగా రూ.10,000 మేర భారీ పతనాన్ని చవిచూసింది. తాజా మార్కెట్ వివరాల ప్రకారం కిలో వెండి రూ.2,45,000 వద్ద నిలిచింది. వివిధ నగరాల్లో నేడు నమోదైన బంగారం రేట్లు ఒక గ్రాముకు ఇలా ఉన్నాయి. చెన్నై.. 24 క్యారెట్లు- రూ. 15,284, 22 క్యారెట్లు - రూ. 14,010, 18 క్యారెట్లు - రూ. 11,780 ముంబై.. 24 క్యారెట్లు - రూ. 15,284, 22 క్యారెట్లు- రూ. 14,010, 18 క్యారెట్లు - రూ. 11,463 బెంగళూరు.. 24 క్యారెట్లు - రూ. 15,284, 22 క్యారెట్లు- రూ. 14,010, 18 క్యారెట్లు - రూ. 11,463 హైదరాబాద్.. 24 క్యారెట్లు - రూ. 15,284, 22 క్యారెట్లు- రూ. 14,010, 18 క్యారెట్లు - రూ. 11,463 విజయవాడ.. 24 క్యారెట్లు - రూ. 15,284, 22 క్యారెట్లు- రూ. 14,010, 18 క్యారెట్లు.

# తిరుమలలో అనూహ్య రద్దీ- టీటీడీ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 :** ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో రద్దీ నెలకొంది. ఆదివారం నాడు ఏకంగా 83,578 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారిలో 31,137 మంది తలనీలాలు సమర్పించారు. తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆ ఒక్క రోజే హుండీ ద్వారా 5.07 కోట్ల రూపాయల కానుకలు తిరుమల తిరుపతి దేవస్థానానికి అందాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోయాయి. శిలాతోరణం వరకు క్యూ లైన్ ఏర్పడింది. టోకెన్ లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి 18 నుంచి 20 గంటల సమయం పట్టింది. ఆ ఒక్క రోజే 4.39 లక్షల లడ్డూలు విక్రయం అయ్యాయి. అలాగే 2.88 లక్షల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. వివిధ అనారోగ్య కారణాలతో మొత్తం 3,631 మంది శ్రీవారి వైద్య సేవను అందుకున్నారు. రద్దీ నేపథ్యంలో క్యూ కాంప్లెక్సులు, క్యూ లైన్లు, నారాయణగిరి షెడ్ల వద్ద టీటీడీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెరటాసి మాసం కొనసాగుతోండటం, అలాగే రాబోయే వరుస సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 1వ తేదీ




గురువారం, 5వ తేదీ సోమవారం ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. ప్రస్తుతం రోజుకు సుమారు 80,000 భక్తులకు స్వామివారి దర్శనం చేసుకుంటోండటం, మరో 30,000 మందికి పైగా భక్తుల దర్శనానికి 24 గంటలకు పైగా పడుతోండటం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీటీడీ తెలిపింది. ఫలితంగా టోకెన్ రహిత సామాన్య భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉండే సమయం మరింత పెరుగుతోందని వివరించింది. ఈ కారణంగా అధిక సంఖ్యలో సామాన్య భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శన భాగ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఆయా తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో 30వ తేది బుధవారం, అక్టోబర్ 4వ తేది ఆదివారం సిఫార్సు లేఖలు స్వీకరించబోమని టీటీడీ తెలిపింది. మరోవంక.. తరిగొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయానికి చెందిన సుమారు 200 ఏళ్ల చారిత్రక నేపథ్యం గల పుష్కరిణిని రూ.1.50 కోట్లతో పునరుద్ధరించడానికి టీటీడీ పూనుకొంది. సోమవారం ఈ పనులకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, పీలేరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, టీటీడీ జేఈవో డాక్టర్ ఏ శరత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడారు. పుష్కరిణి పునరుద్ధరణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నామని అన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



**-హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి**

**-అధికారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్డులోని మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు.

సోమవారం రగుడు బైపాస్ రోడ్డులోని సభా ప్రాంగణాన్ని ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బల్మూరి వెంకట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, ఐఎస్‌డబ్ల్యూఎస్‌సీ ఎస్పీ మాధవరావుతో కలిసి పరిశీలించారు. సభా ప్రాంగణంలో వేదిక, ప్రజలు, వీఐపీలకు సంబంధించిన ఏర్పాట్లు, పార్కింగ్, భద్రత తదితర అంశాలను పరిశీలించారు.అంతకుముందు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్మిస్తున్న హెలిప్యాడ్ పనులను కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, ఐఎస్‌డబ్ల్యూఎస్‌సీ ఎస్పీ మాధవరావు, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

**అధికారులతో కలెక్టర్ సమీక్ష**

సీఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, ఐఎస్‌డబ్ల్యూఎస్‌సీ ఎస్పీ మాధవరావు, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్ ప్రాంతాల్లో పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులు సభా ప్రాంగణం పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టి, తాగునీటి సరఫరాకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్‌పీడీసీఎల్ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరాతోపాటు అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

సీఎం పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ప్రోటోకాల్ ప్రకారం పూర్తి చేయాలని  స్పష్టం చేశారు. శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని, అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, డీఎస్పీలు నాగేంద్రచారి, నర్సిరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్‌పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం పర్యటన వేళ ఆటో కార్మికుల ఆందోళన




**-ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్.. నేతన్న చౌక్‌లో ధర్నా**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న సిరిసిల్లలో పర్యటించనున్న నేపథ్యంలో ఆటో కార్మికులు ఆందోళనకు దిగారు. సిరిసిల్ల పాత బస్టాండ్ సమీపంలోని నేతన్న చౌక్ వద్ద ఆటో కార్మికులు ధర్నా నిర్వహించినారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల ముందు హామీలు.. అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం  అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆటో కార్మికులకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని, ప్రత్యేక ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి కాలం గడుస్తున్నా ఆ హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన సందర్భంగా ఆటో కార్మికుల సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఆటో కార్మికుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.మాటలు కాదు.. హామీల అమలు కావాలి అని,సిరిసిల్లకు వస్తున్న ముఖ్యమంత్రి మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# హామీలపై ప్రజలకు సీఎం సమాధానం చెప్పాలి



**-8 వేల ఎకరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

**-భూకబ్జా ఆరోపణలు నిరూపించాలి.. లేకుంటే క్షమాపణ చెప్పాలి**

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న సీఎం హోదాలో తొలిసారి సిరిసిల్లకు వస్తున్న నేపథ్యంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో న్యాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు తో కలసి జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య  మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ప్రత్యేక స్థానం ఉందని తోట ఆగయ్య అన్నారు. ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో సిరిసిల్లకు వచ్చిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో వస్తున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై సీఎం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలకు బదులు హామీల అమలుపై మాట్లాడాలని కోరారు.

సిరిసిల్లలో 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని, అందులో 2,400 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏ గ్రామంలో, ఏ సర్వే నంబర్లలో ఎంత భూమి ఉందో, ఎవరికి బదలాయింపు జరిగిందో, ఎంత భూమిని స్వాధీనం చేసుకున్నారో ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఆరోపణలు నిరూపించలేకపోతే సీఎం సిరిసిల్ల ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. నేతన్నలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు వర్కర్ టు ఓనర్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల చేనేత, మరమగ్గ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి అండగా నిలవాలని కోరారు.

**సిరిసిల్లకు మూడేళ్లలో చేసిందేమిటి...?**

న్యాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు పూర్తవుతున్నా సిరిసిల్లకు ఇచ్చిన హామీల్లో ఏం అమలు చేసిందో సీఎం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు, నేతన్నలు, రైతుల కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను స్పష్టం చేయాలని కోరారు.

మల్కాపేట రిజర్వాయర్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసిందని, అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా నీటిని తరలించేలా చర్యలు చేపట్టిందని తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేయడంలో జాప్యానికి కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. రైతుబంధు కింద ఎకరాకు రూ.15 వేల చొప్పున చెల్లించడంతోపాటు రైతుబీమా పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.మధ్యమానేరు ప్రాజెక్టు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని,నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.సిరిసిల్ల అభివృద్ధి, నేతన్నల సంక్షేమం, రైతుల సమస్యలు, మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలు, ఎన్నికల హామీల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి తన పర్యటనలో స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, న్యాలకొండ రాఘవరెడ్డి, కంబాల మల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, బొల్లి రామ్మోహన్, జక్కుల నాగరాజు యాదవ్, కౌన్సిలర్లు, మధ్యమానేరు గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# భారతదేశ అభివృద్ధికి మాదకద్రవ్య రహిత యువత కావాలి

బలగం టివి, ఎల్లారెడ్డిపేట

మాదకద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్తును దెబ్బతీయడంతోపాటు ,కుటుంబం, సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని అలవరుచుకోవాలనీ, దేశ ప్రగతిలో యువత కీలక పాత్ర పోషిస్తుందని , విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాలవైపు దృష్టి సారించాలనీ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు అన్నారు.

యెల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలమేరకు  జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో "నషా ముక్తి యువ ఫర్ భారత్ వికసిత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా " ప్రతిజ్ఞ" చేశారు. అనంతరం కళాశాల నుండి బస్టాండ్ వరకు ఆంటిడ్రగ్ పై  స్లోగన్లతో ర్యాలీ నిర్వహించారు.

కళాశాల ఇంచార్జి క్యాతం సత్యనారాయణ మాట్లాడుతూ మత్తు పదార్థాలు పూర్తిగా విడనాడాలని శ్రమజీవనానికి అలవాటుపడి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని , విద్యార్థులు తల్లిదండ్రులు  తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులకు గురువులకు, కళాశాలకు మంచి పేరు తేవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జీ క్యాతం సత్యనారాయణ, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి వాసరవేణి పర్శరాములు, అధ్యాపకులు మాదాసు చంద్రమౌళి,చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణు ప్రసాద్,  గజ్జెల గంగాధర్, వెల్దండి సౌమ్య, అగోలం గౌతమీ, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, కనిమేని దేవేందర్, షాహినా సుల్తానా, నిఖిల్ , ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :



ఈ నెల 30వ తేదీన బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని  కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

ఈ నెల 30వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి రాక నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్... ఎస్పీ మహేష్ బి గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో సోమవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ

సీఎం రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని, అలాగే సిరిసిల్ల రగుడు బై పాస్ రోడ్ వద్ద ఉన్న మైదానంలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్నారని తెలిపారు. పోలీస్ అధికారులు హెలిప్యాడ్, పబ్లిక్ మీటింగ్ స్థలంలో బందోబస్త్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఈఈ ఆర్ అండ్ బీ హెలిప్యాడ్, స్థభ స్థలం వద్ద స్టేజ్, పార్కింగ్ ఏర్పాట్లు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి పారిశుధ్య పనులు, తాగు నీటి సరఫరా కోసం ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్ పీ డీ సీ ఎల్ అధికారులు విద్యుత్ సరఫరా ఇతర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం అన్ని పనులు గడువులోగా ఆయా శాఖల అధికారులు పూర్తి చేయాలని సూచించారు.టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**-రూట్ క్లియరెన్స్, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి..**

**-ఎస్పీ మహేష్ బి. గితే**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీస్ అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన భద్రతపై జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వీవీఐపీ భద్రత, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, సీఎం ప్రయాణించే రూట్, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ క్లియరెన్స్, ప్రజల రాకపోకలు, అత్యవసర పరిస్థితుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ సీఎం ప్రయాణించే మార్గంలో ముందస్తు తనిఖీలు నిర్వహించి రూట్ క్లియరెన్స్‌ను పకడ్బందీగా చేపట్టాలని  సూచించారు. సభా ప్రాంగణంలోకి వచ్చే వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచాలని, అవసరమైన చోట మెటల్ డిటెక్టర్లు, ఇతర భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

వివిధ జిల్లాల నుంచి బందోబస్తుకు వచ్చే పోలీస్ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతోపాటు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# తిమ్మాపూర్ సింగిల్ విండో సభ్యులకు రూ. 79 లక్షల దీర్ఘకాలిక రుణాలు

**రూ. 7 కోట్ల స్వల్పకాలిక రుణాలు ఇచ్చాం**

**తిమ్మాపూర్ సింగిల్ విండో అధ్యక్షులు రామగిరి సుదీర్ రావు**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ సింగల్ విండో సభ్యులకు   ఈ సంవత్సరం  79 లక్షల దీర్ఘకాలిక రుణాలు  7కోట్ల స్వల్పకాలిక రుణాలు  అందజేశామని తిమ్మాపూర్ సింగిల్ విండో అధ్యక్షులు రామగిరి సుధీర్ రావు తెలిపారు. తిమ్మాపూర్ సింగల్ విండో లో అధ్యక్షులు రామగిరి సుధీర్ రావు అధ్యక్షతన మహాసభ జరిగింది.    రైతులకు 360టన్నులు యూరియా సొసైటీ   పరిధి గ్రామాలలో అందజేశామన్నారు.   సంఘం లాభాల బాటలో ఉందని  సంఘం  లోని గ్రామాలలో   రాబోయే రోజుల్లో మరిన్ని సేవలు అందజేస్తామని  రైతులందరూ ఆయిల్ ఫామ్ సాగు చేయాలని తెలిపారు  ఈ కార్యక్రమంలో  జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ మహ్మద్ షఫీ యుద్దీన్  పాల్గొని ప్రసంగించారు.

ఎల్లారెడ్డిపేట మండలంలో 100 ఎకరాల ఆయిల్ ఫామ్ సాగు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు ఆయన చెప్పారు   తిమ్మాపూర్ సొసైటీ పరిధిలో   కొందరు రైతులు  55 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు  చేయడానికి ముందుకు వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం  ఎస్సీ ఎస్టీలకు 90 శాతం బీసీలకు 80%  ఓసీలకు 70%   సబ్సిడీ ఇస్తున్నట్లు ఎకరానికి వెయ్యి రూపాయలు చెల్లిస్తే 50  మొక్కలు   పంపిణి చేయడం  జరుగుతుందన్నారు. వరి ధాన్యం ఇంకా నెల రోజులలో చేతికి వస్తున్నందున ఈసారి రైతులకు ఇబ్బంది కలగకుండా తగినన్ని  గన్ని బ్యాగులను   సమకూర్చాలని  తూకాల్లో మోసాలు జరగకుండా   హమాలీలతో మాట్లాడాలని  రైతులు చైర్మన్ సుధీర్రావుకు వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి శర్మకు  పాలకవర్గ సభ్యులకు    విజ్ఞప్తి చేశారు ,   సొసైటీ పరిధిలో   సింగిల్ విండో ఉపాధ్యక్షులు బుగ్గ కృష్ణమూర్తి శర్మ,  సంఘ డైరెక్టర్లు , ,  గుగులోత్  నరహరి, మాలోత్  శ్రీరామ్,కొంపల్లి కళావతి, రణవేణి లక్ష్మణ్, పెంజర్ల నారాయణ, గూగులోతు శ్రీరామ్,అందే గంగవ్వ  తదితరులు   రైతులు సెక్రటరీ కొండ శశివర్ధన్ గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు,




# వసతులు కల్పించాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న ప్రజల కోసం గాంధీ ఏరియాలో ఒక బ్యాంకును అదేవిధంగా ఏటీఎం సౌకర్యం కల్పించాలంటూ స్థానిక మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో నోడల్ అధికారి సత్తయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న పెన్షన్ దారులు, మహిళ సంఘాల సభ్యులు డిపాజిట్ మరియు విత్ డ్రా కోసం బస్టాండు వెళ్లవలసిన పరిస్థితి నెలకొందని దీంతో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని వెంటనే లీడ్ బ్యాంక్ మేనేజర్ స్పందించి బ్యాంకు తోపాటు ఏటీఎం సౌకర్యం కల్పించాలని బాలరాజు యాదవ్ విన్నవించారు. అదేవిధంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గల క్రిస్టియన్ మతస్థుల వారు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించడానికి స్థలం లేదని వెంటనే మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి సమాధుల తోటకు స్థలం కేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.



## బొప్పాపూర్‌లో రోడ్డు ప్రమాదం.. వ్యక్తికి తీవ్ర గాయాలు

బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామంలోని రామ భిక్షపతి వాటర్ ప్లాంట్ ఎదురుగా రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న గంభీరావుపేటకు చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, గాయపడిన వ్యక్తి పరిస్థితి, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



## కాలుతున్న మోటార్లు.. ఎండుతున్న పంటలు..

బలగం టీవీ, గంభీరావుపేట:

లోవోల్టేజీ సమస్యతో పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వైర్లు తరచూ కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, అనంతరం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

సమస్య పరిష్కారం కోసం ఏడాది కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.ప్రస్తుతం 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై 30కి పైగా మోటార్లు ఉండటంతో విద్యుత్ లోడ్ పెరిగి తరచూ ఫీజు వైర్లు కాలిపోతున్నాయని తెలిపారు. పది నిమిషాలకోసారి ఫీజు వైర్లు కాలిపోయే పరిస్థితి నెలకొందని, దీంతో మోటార్లు కూడా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఇనుప నిర్మాణం కావడంతో ఫీజు వైర్లు వేసే సమయంలో ప్రమాదం పొంచి ఉందని, అయినప్పటికీ పంటలను కాపాడుకునేందుకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రైతులే స్వయంగా ఫీజు వైర్లు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఇంప్రూవ్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఏడాది నుంచి అధికారులను కోరుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి పంటలను కాపాడాలని రైతులు కోరారు. ఇక్కడ నేవూరి మహేష్ రెడ్డి, బోయనగారి రాజు, రమేష్ రెడ్డి, శ్రావణి, సంజీవరెడ్డి, సత్యం రెడ్డి, పిన్నింటి సోమిరెడ్డి, తదితరులు ఉన్నారు



## ఒడిలో పసికందు.. చేతిలో కూరగాయల త్రాసు

### -మాతృత్వంతో పాటు కుటుంబ భారాన్ని మోస్తున్న శ్రమజీవి..
### - రాచర్ల గొల్లపల్లిలో హృదయాన్ని కదిలించిన దృశ్యం

బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట

ఒక చేతిలో పేగు బంధం.. మరో చేతిలో కుటుంబ బాధ్యత. ఒడిలో పసికందు, ముందర కూరగాయల త్రాసు. బిడ్డ ఆకలి, ఏడుపు ఒకవైపు, కుటుంబాన్ని పోషించేందుకు సాగించాల్సిన నిత్యపోరాటం మరోవైపు. మాతృత్వాన్ని, శ్రమను ఏకకాలంలో మోస్తున్న ఓ మహిళ దృశ్యం రాచర్ల గొల్లపల్లి బస్టాండ్ వద్ద పలువురిని కదిలించింది.ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ఓ యువతి పసికందును ఒడిలో పెట్టుకుని కూరగాయలు విక్రయిస్తూ కనిపించింది. ఎండ, దుమ్ము, రహదారి పక్కన ఎదురయ్యే ఇబ్బందులను లెక్కచేయకుండా బిడ్డను దగ్గరకు హత్తుకుని వ్యాపారం కొనసాగిస్తున్నది . బిడ్డను ఇంటి వద్ద వదిలి వెళ్లలేని పరిస్థితి. పనికి రాకుండా ఇంట్లో ఉండలేని ఆర్థిక దుస్థితి,ఈ రెండింటి మధ్య ఆ తల్లి సాగిస్తున్న పోరాటం చూపరుల హృదయాలను తాకింది.

**మాతృత్వం ఓ వైపు.. బతుకుపోరు మరోవైపు**

పసిబిడ్డకు తల్లి దగ్గరగా ఉండాలనే ఆరాటం ఒకవైపు, కుటుంబానికి రెండు పూటలా తిండి పెట్టేందుకు సంపాదించాలనే బాధ్యత మరోవైపు. ప్రసవానంతరం తల్లికి విశ్రాంతి అవసరమైనప్పటికీ, ఆర్థిక పరిస్థితులు ఆమెకు ఆ అవకాశం ఇవ్వడం లేదనే వాస్తవాన్ని ఈ దృశ్యం గుర్తుచేసింది.రోజువారీ సంపాదనపైనే ఆధారపడే వీధి వ్యాపార కుటుంబాల్లో పని మానేస్తే ఆదాయం ఆగిపోతుంది. దీంతో చిన్నారులను వెంట తీసుకొచ్చి రోడ్ల పక్కనే వ్యాపారం చేసుకోవాల్సిన పరిస్థితులు కొందరు మహిళలకు తప్పడం లేదు.

**చంటిబిడ్డలతో వ్యాపారం.. సౌకర్యాలు కరువు**

గ్రామీణ ప్రాంతాల్లో వీధి వ్యాపారం చేసుకునే మహిళలకు కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడం మరో సమస్యగా మారింది. నీడ, తాగునీరు, మరుగుదొడ్లు, చిన్నారుల సంరక్షణకు అనువైన ప్రదేశాలు లేకపోవడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రాచర్ల గొల్లపల్లిలో కనిపించిన ఈ దృశ్యం ఒక మహిళ వ్యక్తిగత కష్టానికే పరిమితం కాదు. కుటుంబాన్ని నిలబెట్టేందుకు ప్రతిరోజూ శ్రమిస్తున్న అనేక మంది మహిళల జీవన వాస్తవానికి ప్రతిబింబం. మాతృత్వాన్ని గుండెల్లో దాచుకుని.. కుటుంబ భారాన్ని భుజాలపై మోస్తూ.. శ్రమనే నమ్ముకుని ముందుకు సాగుతున్న ఈ మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక భద్రత, కనీస సౌకర్యాలు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉంది.




## ఎల్లారెడ్డిపేట సహకార సంఘ అభివృద్ధికి కృషి చేశా

### -14 ఏళ్లుగా అవకాశం కల్పించిన రైతులు, పాలకవర్గ సభ్యులకు రుణపడి ఉంటా..
### - చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి

బలగం టీవీ , ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి గత 14 ఏళ్లుగా కృషి చేసినట్లు సంఘం చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి తెలిపారు. సంఘ కార్యాలయంలో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆదాయ, వ్యయ నివేదికలను సభ్యుల ముందుంచి ఆమోదం పొందారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తయిన ఆడిట్ నివేదికను కూడా సమావేశంలో సమర్పించారు.సభ్యుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు వారి సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు, పాలకవర్గ సభ్యుల సహకారంతో సంఘం అభివృద్ధి సాధించిందన్నారు. ఎన్ఏఎఫ్ఎస్‌సీఏబీ, మాజీ టీఎస్‌సీఏబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సహకారంతో సంఘానికి దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు మంజూరు చేయించామన్నారు.సంఘం రూ.30 కోట్ల టర్నోవర్ సాధించి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏ+ గ్రేడ్‌తో మొదటి పది స్థానాల్లో నిలిచిందని తెలిపారు. నాబార్డ్, డీసీసీబీ సహకారంతో రెండు గోదాములు, పెట్రోల్ బంక్, కార్యాలయ భవనం, బ్యాంకు భవనం నిర్మించుకున్నామని పేర్కొన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టి అధిక లాభాలు పొందాలని సూచించారు.రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను యాప్ ద్వారా కాకుండా మాన్యువల్ విధానంలో అందించాలని కోరారు. 14 ఏళ్లుగా చైర్మన్‌గా సేవలందించే అవకాశం కల్పించిన రైతులు, సంఘ సభ్యులు, పాలకవర్గ సభ్యులు, డీసీసీబీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు గొట్టె సరిత, దొమ్మాటి నర్సయ్య, ల్యాగల సతీష్, నెవూరి వెంకట నరసింహారెడ్డి, గంద్ర ప్రభాకర్‌రావు, కస్తూరి రామచంద్రరెడ్డి, సంఘ కార్యదర్శి అజయ్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే లక్ష్యం..

### ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.టెస్కో, చేనేత జౌళి శాఖ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, విజయ రమణారావు, వేముల వీరేశం, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పరిశ్రమలు, వాణిజ్య, టెక్స్టైల్స్

సబ్య సాచి ఘోష్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ తో కలిసి ఆధ్వర్యంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రతినిధులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సిరిసిల్లలోని చేనేత, జౌళి రంగం ప్రస్తుత పరిస్థితి, పవర్‌లూమ్ రంగం అభివృద్ధి, వస్త్ర ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. వివిధ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పరిశ్రమల అభివృద్ధి, కార్మికులకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పన, ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ, స్థానికంగా వస్త్ర పరిశ్రమను మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చ జరిగింది.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ముందుకు



వెళ్తుందని తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కు రూ. 300 కోట్లకు పైగా బకాయిలు చెల్లించామని గుర్తు చేశారు. జిల్లాలోని 132 మ్యాక్స్ సంఘాలకు గత ఏడాది 6.86 కోట్ల మీటర్ల ఇందిరా మహిళా శక్తి చీరలు ఆర్డర్ ఇవ్వగా, ఈ ఏడాది 6.33 కోట్ల మీటర్ల ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్ లు ఇచ్చామని తెలిపారు. స్కూల్ యూనిఫాం గత ఏడాది 1.03 కోట్ల మీటర్ల ఆర్డర్ ఇచ్చామని, ఈ ఏడాది దాదాపు 37 లక్షల మీటర్ల ఆర్డర్ ఇచ్చామని తెలిపారు.పరిశ్రమ బాధ్యులు కార్మికులు ఉపాధి భవిష్యత్తుపై ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి లక్ష్యంగా రూపాయలు 50 కోట్లతో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేశామని, క్రెడిట్ పై వస్త్ర పరిశ్రమకు అందిస్తున్నామని తెలిపారు. కామన్ ఫెసిలిటీ సెంటర్, తదితర వసతులపై సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు .

**కార్మికులకు ఉపాధి..**

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సిరిసిల్లలో ఇందిరా మహిళా శక్తి చీరలతో వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఉపాధి అవకాశం కల్పిస్తున్నామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పరిశ్రమలు, వాణిజ్య, టెక్స్టైల్స్ సబ్య సాచి ఘోష్ తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, టెక్స్టైల్ ప్రతినిధులు తమ దృష్టికి తీసుకువచ్చిన అన్ని అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వివరించారు. ఇప్పటికే పలు సమస్యలు పరిష్కరించామని తెలిపారు. సమావేశంలో వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యల కోసం సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎన్ వెంకటేశ్వర్ రావు, జాయింట్ డైరెక్టర్ ఇందుమతి, ఏడీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లకు మంజూరైన రూ.60 కోట్ల పనులకు నిధులివ్వాలి..



### -మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

సిరిసిల్ల పట్టణ అభివృద్ధికి గతంలో మంజూరై, టెండర్ ప్రక్రియ పూర్తయిన సుమారు రూ.60 కోట్ల విలువైన పనులకు నిధులు విడుదల చేసి వెంటనే ప్రారంభించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్పర్సన్ జిందం కళా మాట్లాడుతూ 2023లో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.40 కోట్లు మంజూరయ్యాయని, శ్రీనగర్ కాలనీ కాలువ నిర్మాణానికి రూ.14 కోట్లు, లింక్ రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు కేటాయించారని తెలిపారు. మొత్తంగా సుమారు రూ.60 కోట్ల పనులకు పరిపాలనా అనుమతులు లభించడంతో పాటు టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు.అయితే ప్రభుత్వం మారిన అనంతరం ఆయా పనులకు నిధులు విడుదల కాకపోవడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. ప్రజా పాలనలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తయిన పనులకు నిధులు విడుదల చేసి సిరిసిల్ల ప్రజలకు ప్రయోజనం కల్పించాలని కోరారు.

పట్టణంలోని ప్రధాన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు లేఖ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం తరఫున సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.పక్క నియోజకవర్గమైన వేములవాడలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, సిరిసిల్లలో మాత్రం గతంలో టెండర్లు పూర్తయిన పనులకు కూడా నిధులు విడుదల కాకపోవడం వల్ల పట్టణ అభివృద్ధి మందగిస్తోందని అన్నారు. ప్రజలకు సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఇంకా అనేక మౌలిక వసతుల సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ నెల 30న సిరిసిల్లకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభా వేదిక నుంచి పెండింగ్ పనులకు నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ పాలకవర్గం తరఫున విజ్ఞప్తి చేశారు.ప్రజా పాలన అంటే ప్రజల అవసరాలను తీర్చడమే. సిరిసిల్లకు ఇప్పటికే మంజూరైన, టెండర్లు పూర్తయిన పనులకు నిధులు విడుదల చేసి పట్టణ అభివృద్ధికి సహకరించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రాయిని చెరువుకు నీరేది..?

**మూడేళ్లయినా.. 9వ ప్యాకేజీ ఏదీ..?**
**-పంటలు ఎండుతున్నాయి.. ప్రభుత్వం స్పందించాలి**
**బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

9వ ప్యాకేజీ పనులు పూర్తికాక రాయిని చెరువు ఎండిపోవడంతో పాటు పంట పొలాలు ఎండిపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని,9వ ప్యాకేజీ పనులను తక్షణమే పూర్తి చేసి మద్దిమల్ల రాయిని చెరువుకు సాగునీరు అందించాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు.

రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో మద్దిమల్ల గ్రామం నుంచి వీర్నపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం వరకు సోమవారం రైతు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం రైతుల సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు బసవాపురం లక్ష్మి నర్సయ్య , జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు గోపి హాజరయ్యారు.

ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందుతుందని చెప్పిన గత పాలకులు మద్దిమల్లలో ఎండిపోయిన రాయిని చెరువు, పంట పొలాలను పరిశీలించాలని అన్నారు. కాళేశ్వరం ద్వారా సాగునీరు అందించడమే లక్ష్యమైతే రాజన్న సిరిసిల్ల జిల్లా రైతులకు నీరు ఎందుకు అందడం లేదని ప్రశ్నించారు.మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఒక్కసారి మద్దిమల్లకు వచ్చి రాయిని చెరువు పరిస్థితిని, సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల సమస్యలను చూడాలని కోరారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి రాయిని చెరువుకు రావాల్సిన పైప్‌లైన్ పనులు కంచర్ల అటవీ ప్రాంతంలో ఎందుకు నిలిచిపోయాయని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలోనే పనులు ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.




రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎల్లారెడ్డిపేట పర్యటనలో 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పనులు చేయలేదని కాంగ్రెస్ చెబుతోందని, మరి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. రైతులకు రాజకీయ విమర్శలు అవసరం లేదని, పొలాల్లో నీరు.. చెరువుల్లో నీరు.. పంటకు భరోసా కావాలని అన్నారు.

**రైతు పొలంలో నీరు వచ్చే వరకు పోరాటం**

రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు బసవాపురం లక్ష్మి నరసయ్య మాట్లాడుతూ రైతు పంట పండించాలంటే ముందుగా సాగునీరు అవసరమన్నారు. సాగునీటి కోసం రైతులు రోడ్లపైకి వచ్చి పాదయాత్ర చేయాల్సిన పరిస్థితి ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమన్నారు. 9వ ప్యాకేజీ పనులను పూర్తి చేసి రాయిని చెరువుకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై బీజేపీ ప్రకటనలకు మాత్రమే పరిమితం కాదని, అవసరమైతే మరింత పెద్ద ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు.

**హామీలను నిలబెట్టుకోవాలి**

బీజేపీ జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం సరికాదన్నారు. 9వ ప్యాకేజీ పూర్తయితే ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిసినా పనులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక ప్రభుత్వం చేసిన తప్పును మరో ప్రభుత్వంపై నెట్టి తప్పించుకోవడం సరికాదన్నారు. రైతులకు రాజకీయాలు కాదు.. సాగునీరు కావాలని స్పష్టం చేశారు.

9వ ప్యాకేజీ పనులు పూర్తయ్యే వరకు, రాయిని చెరువులో నీరు నిండే వరకు, రైతు పొలాల్లో పచ్చదనం వచ్చే వరకు రైతుల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నాడి జలపతిరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ నాయక్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ సాబీర్, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, వీర్నపల్లి మండల అధ్యక్షుడు లకుపతి నాయక్‌తో పాటు రాష్ట్ర, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సీఎం రాకలోపే మా సమస్యలకు సమాధానం చెప్పాలి

### -అగ్రహారం జేఎన్‌టీయూ విద్యార్థుల నిరసన

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న సిరిసిల్ల జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో అగ్రహారం జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలకు శాశ్వత భవనం, ప్రత్యేక హాస్టల్ భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న వసతులు విద్యార్థుల అవసరాలకు సరిపోవడం లేదని తెలిపారు. సాంకేతిక విద్యకు అవసరమైన ఆధునిక ల్యాబ్ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రయోగాత్మక విద్యలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

అలాగే గెస్ట్ ఫ్యాకల్టీపై ఆధారపడకుండా కళాశాలలో శాశ్వత అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. అధ్యాపకుల కొరత విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రభావం చూపుతోందని తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. శాశ్వత భవనం, హాస్టల్, ఆధునిక ల్యాబ్ పరికరాలు, శాశ్వత అధ్యాపకుల నియామకంపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



# ఓటు ప్రతి భారత పౌరుడి ప్రజాస్వామ్య హక్కు..




**-ఓటర్ల జాబితా సవరణ, ఓట్ల తొలగింపుపై సిరిసిల్లలో నిరసన..**
**- సీఈసీ దిష్టిబొమ్మ దహనం**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

ఓటు ప్రతి భారత పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని,అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించకుండా చూడాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హెచ్. హనుమంతరావు డిమాండ్ చేశారు.

ఓటర్ల జాబితా సవరణ, ఓట్ల తొలగింపు అంశాలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హెచ్. హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అనర్హులు, మరణించిన వ్యక్తులు, డూప్లికేట్ ఓట్లు ఉంటే నిబంధనల ప్రకారం వాటిని మాత్రమే తొలగించాలని అన్నారు .దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా హర్యానా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఓట్ల తొలగింపు, ఓట్ల చేర్పుపై కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేస్తోందన్నారు. ఓటర్ల పేర్ల తొలగింపునకు నిర్దిష్ట విధానం ఉందని, సంబంధిత వ్యక్తికి అవకాశం ఇవ్వకుండా ఓటు తొలగించలేమని ఎన్నికల సంఘం గతంలో స్పష్టం చేసినదని అన్నారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల సంఘంలో అభిప్రాయ భేదాలు ఉన్నాయని అన్నారు. అయితే కమిషన్ తీసుకున్న నిర్ణయాలు ఏకగ్రీవంగానే ఉన్నాయని ఎన్నికల సంఘం స్పష్టం చేసినదని అన్నారు . ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణనలో కులగణనను కూడా చేపట్టాలని కోరారు. దేశ జనాభాలో బీసీల సంఖ్యను కచ్చితంగా గుర్తించేందుకు కులగణన అవసరమన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం గ్రామస్థాయి నుంచి దేశ రాజధాని వరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సభకు అధిక సంఖ్యలో తరలి రావాలి

**నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్**
**సంస్కృతిక శాఖ సలహాదారుడు దరువు ఎల్లన్న**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్న సందర్భంగా సోమవారం ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు సూడిది రాజేందర్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, సాంస్కృతిక శాఖ సలహాదారుడు దరువు ఎల్లన్న హాజరయ్యారు. పార్టీ ముఖ్య నాయకులతో చర్చించారు. సభకు జనాలను తరలించేందుకు పలు సలహాలు చేశారు. ఎల్లారెడ్డిపేటకు ఒక చరిత్ర ఉందని ఆ చరిత్రకు అనుగుణంగా ముఖ్యమంత్రి సభకు ప్రజలను అధిక సంఖ్యలో తరలించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, చిన్ని బాబు, గుర్రాల రాజిరెడ్డి, బండారి బాల్ రెడ్డి, రామ్ రెడ్డి, పలువురు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# సీఎం పర్యటన.. సిరిసిల్ల సమస్యలకు పరిష్కారం చూపాలి

**-వస్త్ర పరిశ్రమ, భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..**
**-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన జిల్లాలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి దోహదపడేలా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ కోరారు. సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముశం రమేష్ మాట్లాడుతూ

అసెంబ్లీలో సీఎం ప్రకటించిన జిల్లాలోని 8 వేల ఎకరాల భూముల అంశంపై స్పష్టత ఇవ్వడంతోపాటు, భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని, భూమిలేని రైతులకు సాగుభూమి అందించాలని కోరారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో ఉందని, దాని మనుగడకు ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందించాలని అన్నారు. వర్కర్ టు ఓనర్ షెడ్లను వెంటనే కార్మికులకు కేటాయించి, పవర్‌లూమ్‌లు అందించాలని కోరారు. పవర్‌లూమ్ పరిశ్రమకు ఉచిత విద్యుత్, నూలు సబ్సిడీ, ప్రభుత్వం కొనుగోలు చేసే వస్త్రాలకు సకాలంలో చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ చీరలు, ఇందిరమ్మ చీరలకు సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.పవర్‌లూమ్ కార్మికుల సంక్షేమ బోర్డు, శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని, టెక్స్‌టైల్ పార్కులో మూతపడిన పరిశ్రమలను పునఃప్రారంభించి విద్యుత్ సబ్సిడీ అందించాలని అన్నారు. సిరిసిల్లలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలని కోరారు.మిడ్‌మానేరు నిర్వాసితులకు పెండింగ్ నష్టపరిహారం చెల్లించి, వారి ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు



కల్పించాలని, జిల్లాలో అవసరమైన చోట వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అప్పర్ మానేరు, నర్మాల డ్యామ్‌ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.ఈ సమావేశంలో సీపీఎం నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, సూరం పద్మ, అన్నల్దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్, బెజిగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.




## సమిష్టి సహకారంతోనే సంఘ అభివృద్ధి

**-రైతులు, సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తాం:**
**గంభీరావుపేట సింగిల్ విండో చైర్మన్ వేషాల వెంకటి**

బలగం టీవీ,గంభీరావుపేట:

రైతులు, సంఘ సభ్యుల సమిష్టి సహకారంతోనే సహకార సంఘం అభివృద్ధి సాధ్యమవుతుందని గంభీరావుపేట సింగిల్ విండో చైర్మన్ వేషాల వెంకటి అన్నారు. సోమవారం సింగిల్ విండో చైర్మన్ వేషాల వెంకటి అధ్యక్షతన సింగిల్ విండో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ వేషాల వెంకటి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులు కటకం మృత్యుంజయం, కేకే మహేందర్‌రెడ్డితో పాటు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మాదిరిగానే రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు ముందుకు రావాలని, సంఘం ద్వారా అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ కోసం సంఘం పరిధిలోని 750 మంది సభ్యులు రూ.2 వేల చొప్పున చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు 450 మంది చెల్లించారని చెప్పారు. వరి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబెట్టుకోవాలని సూచించారు. జియో ట్యాగింగ్ అందుబాటులోకి వస్తున్నందున ఇకపై కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం తూకాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ బలరాంరెడ్డి, ప్రత్యేక అధికారి రాములు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



# ఏషియన్ గేమ్స్‌లో భారత్‌కు పతకాల పంట







బలగం టీవీ, హైదరాబాద్

ఏషియన్ గేమ్స్-2026లో భారత్ పతకాల సంఖ్య 45కు చేరింది. ఇప్పటివరకు భారత్ నాలుగు స్వర్ణాలు, 20 రజతాలు, 21 కాంస్య పతకాలు సాధించింది. తొమ్మిదో రోజు అథ్లెటిక్స్, షూటింగ్‌లో భారత క్రీడాకారులు రాణించగా.. ఒకే రోజు ఆరు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో ఈషా సింగ్ రజత పతకం సాధించింది. అథ్లెటిక్స్‌లో మూడు రజతాలు, మూడు కాంస్యాలు భారత్ సాధించింది.

షూటింగ్‌లో ఈషా సింగ్ రజతంతో భారత్‌కు ఊరట లభించింది. ఇదే ఈవెంట్‌లో వ్యక్తిగత విభాగంలో మను భాకర్ అర్హత సాధించలేకపోగా, రాహీ సర్నోబత్ ఫ్రేమ్‌ను తాకడంతో జట్టు విభాగంలో భారత్ పతకానికి దూరమైంది.

కురాష్ మహిళల 78 కిలోల విభాగంలో పింకీ బాల్హారా సెమీఫైనల్లో ఓడినా కాంస్య పతకం సాధించింది. బాక్సింగ్‌లో లోవ్లినా బోర్గోహైన్ 75 కిలోల విభాగంలో కొరియాకు చెందిన సియోంగ్ సుయోన్‌పై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. ప్రియా ఘంఘాస్ 60 కిలోల విభాగంలో తజికిస్థాన్‌కు చెందిన మిజ్గోనా సమదోవాపై గెలిచి సెమీఫైనల్‌కు చేరింది. కపిల్ పొఖరియా కూడా బాక్సింగ్‌లో పతకాన్ని ఖాయం చేసుకున్నాడు.

**ఇతర ఫలితాలు**

ఆర్చరీ పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో గణేశ్ మణి రత్నం తిరుమూరు సాహిల్ జాదవ్‌పై 149-148తో విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్‌కు చేరాడు. అంతకుముందు సాహిల్ జాదవ్ మంగోలియాకు చెందిన జమియాంగోంబో పురేవ్‌డోర్జ్‌పై 149-137తో గెలిచాడు. గణేశ్ ఇండోనేషియాకు చెందిన సోస్టర్ అందారు రినాల్డిపై 144-142తో విజయం సాధించాడు.

పురుషుల వాలీబాల్‌లో భారత్ హాంకాంగ్‌పై 3-0తో విజయం సాధించింది. స్క్వాష్‌లో మహిళల జట్టు చైనాపై 3-0తో, పురుషుల జట్టు చైనాపై 3-0తో గెలిచింది. మహిళల జట్టు జపాన్‌పై 2-1తో విజయం సాధించింది.

క్రికెట్‌లో భారత్, అఫ్గానిస్థాన్ మధ్య క్వార్టర్‌ఫైనల్ వర్షం కారణంగా రద్దైంది. దీంతో భారత జట్టు సెమీఫైనల్‌కు అర్హత సాధించింది.

సెపక్ టక్రాలో మహిళల డబుల్స్‌లో భారత్ జపాన్ చేతిలో 1-2తో ఓడి గ్రూప్-బీలో చివరి స్థానంలో నిలిచి నిష్క్రమించింది. సర్ఫింగ్‌లో కిశోర్ కుమార్ అంబరాసు చైనాకు చెందిన మా వెన్‌సాంగ్‌పై 9.86-8.80తో విజయం సాధించగా, శివరాజ్ బాబు ఫిలిప్పీన్స్‌కు చెందిన జయువార్డ్ అల్సిసో చేతిలో 7.83-11.50తో ఓడాడు.

టెన్నిస్ మహిళల డబుల్స్‌లో అంకిత రైనా-రుతుజా భోసలే జోడీ కజకిస్థాన్‌కు చెందిన అన్నా దానిలినా-యులియా పుటిన్‌సేవా జోడీ చేతిలో ఓడింది. సుమిత్ నగాల్-హాంగ్ సియోంగ్‌చాన్ పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్ వాయిదా పడింది.

షూటింగ్ పురుషుల ట్రాప్ అర్హత పోటీల్లో రెండో రోజు ముగిసేసరికి శపథ్ భరద్వాజ్ ఐదో స్థానంలో, కైనన్ చెనాయ్ 19వ స్థానంలో, అహ్వార్ రిజ్వీ 32వ స్థానంలో నిలిచారు. మహిళల ట్రాప్‌లో నీరూ తొలి స్థానంలో, మనీషా కీర్ 21వ స్థానంలో, ఆశిమా అహ్లావత్ 23వ స్థానంలో ఉన్నారు.




## పీటీ ఉష జాతీయ రికార్డును బద్దలు కొట్టిన విద్యా రామ్‌రాజ్

**ఆసియా క్రీడల్లో 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్యం**

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడలు-2026లో మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో భారత క్రీడాకారిణి విద్యా రామ్‌రాజ్ కాంస్య పతకం సాధించారు. 54.75 సెకన్లలో రేసును పూర్తి చేసిన విద్యా.. 42 ఏళ్లుగా కొనసాగుతున్న పీటీ ఉష జాతీయ రికార్డును బద్దలు కొట్టారు. 1984 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో పీటీ ఉష 55.42 సెకన్లలో నమోదు చేసిన సమయమే ఇప్పటివరకు జాతీయ రికార్డుగా ఉంది.

ఈ పోటీలో యూఏఈకి చెందిన మరియం కరీం 54.31 సెకన్ల గేమ్స్ రికార్డుతో స్వర్ణ పతకం సాధించగా, కజకిస్థాన్‌కు చెందిన అడెలినా జేమ్స్ 54.58 సెకన్లతో రజతం గెలుచుకున్నారు. విద్యా 54.75 సెకన్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు.

ఈ ఆసియా క్రీడల్లో విద్యా రామ్‌రాజ్‌కు ఇది రెండో పతకం. అంతకుముందు జరిగిన 4×400 మీటర్ల మిశ్రమ రిలేలో రజతం సాధించిన భారత జట్టులో ఆమె కీలకంగా వ్యవహరించారు. 2022 ఆసియా క్రీడల్లోనూ 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్యం, మహిళల 4×400 మీటర్ల రిలే, మిశ్రమ 4×400 మీటర్ల రిలేల్లో రజత పతకాలు సాధించారు.

తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన విద్యా రామ్‌రాజ్ సాధారణ కుటుంబం నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. ట్రక్ డ్రైవర్ కుమార్తె అయిన ఆమె ఆర్థిక ఇబ్బందులను అధిగమించి క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదిగారు. ఆమె కవల సోదరి నిత్య కూడా క్రీడాకారిణే. ప్రస్తుతం విద్యా రామ్‌రాజ్ భారత రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు. 2017 వరకు 100, 200 మీటర్ల పరుగుల్లో పాల్గొన్న ఆమె అనంతరం 400 మీటర్ల హర్డిల్స్‌పై దృష్టి సారించి విజయాలు సాధిస్తున్నారు.

# టీమిండియా పాకిస్థాన్ సెమీస్‌కు...





**ఒక్క బంతి ఆడకుండానే**
**వర్షం కారణంగా భారత్-అఫ్గానిస్థాన్ పాకిస్థాన్-హాంకాంగ్ క్వార్టర్‌ఫైనల్లు రద్దు**

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడల పురుషుల క్రికెట్‌లో టీమిండియా ఒక్క బంతి కూడా ఆడకుండానే సెమీఫైనల్‌కు చేరింది. భారత్-అఫ్గానిస్థాన్ మధ్య సోమవారం జరగాల్సిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ భారీ వర్షం కారణంగా టాస్ కూడా పడకుండానే రద్దయింది. దీంతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న భారత్‌కు సెమీఫైనల్ బెర్త్ లభించగా.. అఫ్గానిస్థాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

మ్యాచ్ జరగాల్సిన మైదానంలో గత శుక్రవారం జరిగిన రెండు మ్యాచ్‌లు కూడా వర్షం కారణంగా రద్దయ్యాయి. వర్షం ఎంతకీ తగ్గకపోవడంతో మైదానం ఆటకు అనుకూలంగా లేకుండా పోయింది. దీంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాదని అంపైర్లు ప్రకటించారు. భారత్ సెమీఫైనల్‌లో శ్రీలంక-నేపాల్ క్వార్టర్‌ఫైనల్ విజేతతో తలపడనుంది.

**పాకిస్థాన్ కూడా..**

పాకిస్థాన్ జట్టు కూడా ఒక్క బంతి ఆడకుండానే సెమీఫైనల్‌కు చేరింది. పాకిస్థాన్-హాంకాంగ్ మధ్య సోమవారం జరగాల్సిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ కూడా భారీ వర్షం కారణంగా రద్దయింది. నిషీన్‌లోని కోరోగి స్పోర్ట్స్ పార్క్‌లో మ్యాచ్ జరగాల్సి ఉండగా.. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో కనీసం టాస్ కూడా సాధ్యపడలేదు.

మ్యాచ్ రద్దు కావడంతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో మెరుగైన సీడింగ్ ఉన్న పాకిస్థాన్‌కు సెమీఫైనల్ బెర్త్ దక్కింది. దీంతో హాంకాంగ్ మైదానంలో పోరాడే అవకాశం లేకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. పాకిస్థాన్ సెమీఫైనల్‌లో బంగ్లాదేశ్-మలేషియా క్వార్టర్‌ఫైనల్ విజేతతో తలపడనుంది.

ఆసియా క్రీడల క్రికెట్ నిబంధనల ప్రకారం టాప్ సీడింగ్ పొందిన భారత్, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు నేరుగా క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించాయి. మిగిలిన జట్లు గ్రూప్ దశలో పోటీపడి నాకౌట్ దశకు చేరుకున్నాయి. గత ఏడాది హాంగ్‌జౌ ఆసియా క్రీడల క్రికెట్ ఫైనల్ కూడా వర్షం కారణంగా రద్దవగా.. మెరుగైన సీడింగ్ ఆధారంగా భారత్‌కు స్వర్ణ పతకం లభించింది.




## 1500 మీటర్లలో గుల్వీర్‌కు రజతం

**ఆసియా క్రీడల్లో రెండో పతకం సొంతం**

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడలు-2026లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ మరో రజత పతకం సాధించాడు. సోమవారం జరిగిన పురుషుల 1500 మీటర్ల ఫైనల్‌లో 3:36.72 నిమిషాల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచి రజతాన్ని సొంతం చేసుకున్నాడు. ఇదే క్రీడల్లో గతంలో 10,000 మీటర్ల విభాగంలోనూ గుల్వీర్ రజత పతకం సాధించిన విషయం తెలిసిందే.

1500 మీటర్ల ఫైనల్‌లో చివరి వరకు గుల్వీర్ ఆధిక్యంలో ఉన్నాడు. అయితే ముగింపు దశలో జపాన్‌కు చెందిన కజుటో ఇజావా అనూహ్యంగా పుంజుకుని గుల్వీర్‌ను అధిగమించాడు. కజుటో 3:36.35 నిమిషాల టైమింగ్‌తో స్వర్ణ పతకం సాధించాడు. గుల్వీర్ కేవలం 0.37 సెకన్ల తేడాతో స్వర్ణాన్ని కోల్పోయాడు. మరో జపాన్ అథ్లెట్ నగియా మోరీ 3:37.92 నిమిషాల్లో రేసును పూర్తి చేసి కాంస్య పతకం దక్కించుకున్నాడు.

ఈ విజయంతో ఆసియా క్రీడలు-2026లో గుల్వీర్ సింగ్ తన పతకాల సంఖ్యను రెండుకు పెంచుకున్నాడు.